# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక








అమలాపురం | సంపుటి : 10 సంచిక : 35 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | గురువారం 27 మార్చి 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 35 27-03-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




## పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతి పై
# విచారణకు సీఎం ఆదేశం

**అమరావతి మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నవిషయం తెలిసిందే. అయితే ప్రవీణ్ పగడాల మృతిపై స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో మాట్లాడిన సీఎం చంద్రబాబు.. పాస్టర్ ప్రవీణ్ మృతి ఘటనపై అన్ని కోణాల్లో విచారణ జరపాలని ఆదేశించారు. మరోవైపు ఏపీ మంత్రి నారా లోకేష్ కూడా స్పందించారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ హఠాన్మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందని లోకేష్ పేర్కొన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ప్రవీణ్ మృతిని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో రోడ్డు ప్రమాదంగా గుర్తించారని చెప్పారు. అయితే వివిధ సంఘాలు పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం పూర్తిస్థాయి దర్యాప్తు చేయిస్తుందని లోకేష్ తెలిపారు. ఇక, పాస్టర్ ప్రవీణ్ పగాడల మృతిపై ఆరోపణల నేపథ్యంలో హెూంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్‌కు ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు. పాస్టర్ ప్రవీణ్ మరణంపై సమగ్ర విచారణకు

- తరువాయి 2లో..

## ఆర్థిక ఇబ్బందులున్నా ఉద్యోగులకి
# లోటు లేకుండా చేస్తాం: చంద్ర బాబు

### ఉద్యోగులకు శుభవార్త
### రూ.7,230 కోట్లు విడుదల



**అమరావతి మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త అందించారు. గత ప్రభుత్వ హయాంలో చెల్లించకుండా నిలిపివేసిన బకాయిల్లో ప్రస్తుతానికి రూ.7,230 కోట్లను విడుదల చేసినట్లు ప్రకటించారు. ఇదివరకే రూ.1,030 కోట్లు విడుదల చేయగా, తాజాగా మరో రూ.6,200 కోట్లను విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు. సచివాలయంలో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు పాలనలో భాగమని, వారి హక్కులను కాపాడేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రూ.20,637 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, ఆర్థిక ఇబ్బందులున్నా దశలవారీగా వాటిని చెల్లిస్తున్నామని వివరించారు. మిగిలిన బకాయిలు కూడా వెసులుబాటు చూసి విడుదల చేస్తామని తెలిపారు. అలాగే, ఉద్యోగులు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ముందుకు రావాలని చంద్రబాబు కోరారు.

**బకాయిల భారం %-% ప్రభుత్వ నిబద్ధత**

సచివాలయంలో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగులు ప్రభుత్వ విధానాలను అమలు చేసే ముఖ్య భాగమని, వారికి రావాల్సిన అలవెన్సులు అందకపోవడం తీవ్ర అన్యాయమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల బకాయిలు భారీగా పెరిగి రూ.20,637 కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు సంక్లిష్టంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వ నిబద్ధతను చాటుకుంటూ కొంత మొత్తాన్ని విడుదల చేశామని, మిగిలిన బకాయిలు కూడా పరిస్థితులను బట్టి విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు రావాల్సిన వేతనాలు, పెండింగ్ బకాయిలను తీర్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించామని సీఎం చంద్రబాబు

- తరువాయి 2లో..



## కొడాలి నానికి గుండెపోటు
# ఆస్పత్రికి తరలింపు

ఆంధ్రప్రదేశ్ వైసీపీ నేత, మాజీ మంత్రి కొడాలి నాని అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న ఆయన, ఛాతీ నొప్పితో బాధపడుతూ హుటాహుటిన గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రి లో చేరారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతుండగా, ఆయన ఆరోగ్యంపై వైసీపీ శ్రేణులు, అనుచరులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొడాలి నాని గతంలో గుండె సంబంధిత సమస్యలతో బాధపడ్డారు. ఈ నేపథ్యంలో, తాజా గా ఆయన అస్వస్థత కు గురయ్యారు. గుండె సమస్య కారణంగా ఆయనకు ఛాతీ నొప్పి వచ్చిందా, లేక గ్యాస్ట్రిక్ సమస్యల వల్ల వచ్చిందా అనే దానిపై డాక్టర్లు క్లారిటీ ఇచ్చేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయనకు బైపాస్ సర్జరీ చేయాలని వైద్యులు చెప్పినట్లు సమాచారం. కొడాలి నాని

- తరువాయి 2లో..

## ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం
# 'ఉగాది కానుక'

**అమరావతి మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఉగాది కానుకగా సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించనుంది. రాష్ట్రంలో రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఈ పథకం ద్వారా నాణ్యమైన సన్నబియ్యాన్ని అందించనుంది. ఉగాది పండగ రోజు సాయంత్రం 6 గంటలకు హుజూర్నగర్‌లో సీఎం రేవంత్ రెడ్డి

- తరువాయి 2లో..

## ఈనెల 28న ప.గో జిల్లాలో
# పవన్ పర్యటన



**అమరావతి మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈ నెల 28న పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఆయన ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటికి పరిష్కార మార్గాలను సూచించనున్నారు. ముఖ్యంగా జనసేనకు బలమైన ఆదరణ ఉన్న ప్రాంతాల్లో పవన్ పర్యటన జరగనున్నది.

**మొగల్తూరులో గ్రామ సభ**

ఉదయం మొగల్తూరులో పవన్ కళ్యాణ్ గ్రామ సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని, అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలిస్తారు. ఆయా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి, నీటి సరఫరా, విద్యుత్ సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

**పెనుగొండలో ప్రజా భేటీ**

సాయంత్రం పెనుగొండలో మరో గ్రామ సభను నిర్వహించనున్న పవన్ కళ్యాణ్, ప్రజలతో నేరుగా మాట్లాడి, వారి అవసరాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధిని వేగవంతం చేయాలనే ఉద్దేశంతో వివిధ శాఖల అధికారులను పిలిచి సమీక్ష చేయనున్నారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ పథకాలు

- తరువాయి 2లో..

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై
# లోతైన విచారణ
## హెూం మంత్రి అనిత

**రాజమహేంద్రవరం మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై లోతైన విచారణ చేయిస్తున్నామని హెూం మంత్రి అనిత తెలిపారు. డీఎస్పీ స్థాయి పోలీసు అధికారుల కమిటీ విచారణ చేస్తోందన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా ఈ ఘటనపై దర్యాప్తు చేస్తోందన్నారు. రాజమహేంద్రవరంలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్నామని తెలిపారు.**



దీనిని కేవలం యాక్సిడెంట్‌గా మాత్రమే పరిగణించటం లేదన్న హెూం మంత్రి.. ఈ ఘటనపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతోందన్నారు. రాజకీయంగా, మతపరంగా విద్వేషాలు రగిలేలా వ్యవహరించొద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోందన్నారు. ప్రమాదవశాత్తూ ఈ ఘటన జరిగిందా? ఏమైనా ఇంటెన్షన్ ఉందా? అన్న దానిపైనా విచారణ చేస్తున్నామన్నారు. అనుమానాస్పద మృతిగానే ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. ఘటనా స్థలికి సమీపంలో కాల్ డేటా రికార్డులు కూడా తీసుకుంటున్నామన్నారు. దర్యాప్తు విషయంలో ఎవరికీ ఎలాంటి అభద్రతా భావన అవసరం లేదని హెూం మంత్రి తెలిపారు.



## జపాన్ ప్రతినిధులతో
# సీఎం చంద్రబాబు భేటీ

**అమరావతి మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమరావతిలో జపాన్ ప్రతినిధి బృందంతో సమావేశమైనట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. "ఈరోజు అమరావతిలో జపాన్ రాయబారి కెయిచి ఓనో నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో సమావేశమయ్యాం. ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడం, ఆంధ్రప్రదేశ్లో జపాన్ పెట్టుబడులను విస్తరించడంపై చర్చలు జరిగాయి. నౌకానిర్మాణం, ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, ఆటోమొబైల్స్, విద్య వంటి వివిధ రంగాలలో సహకారాన్ని అన్వేషించడంపై మా చర్చలు కొనసాగాయి" అని ట్వీట్ చేశారు.

# ఇంటర్ సిలబస్, పరీక్ష కొత్త విధానం

**అమరావతి మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్ష విధానంలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. వీటిని 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నారు. మొదటిసారిగా ఇంటర్ విద్యలో ఒక్క మార్కు ప్రశ్నలను ప్రవేశపెడుతున్నారు. ఈ మేరకు ఇంటర్ సిలబస్, ప్రశ్నపత్రాల నమూనాలో ఇంటర్మీడియట్ బోర్డు పలు మార్పులు చేసింది. ఈ మార్పుల వివరాలను తాజాగా జూనియర్ కళాశాలలకు పంపింది. ఇంటర్ మొదటి ఏడాదిలో ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను ప్రవేశపెడుతున్నారు. ఈ ఏడాది పదో తరగతిలో ఎన్‌సీఈఆర్టీ సిలబస్ తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. దీన్ని వచ్చే ఏడాదికి ఇంటర్మీడియట్‌కు పొడిగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఇప్పటివరకు ఇంటర్ గణితంలో ఏ, బీ పేపర్లు ఉండగా 75 మార్కుల చొప్పున 150 మార్కులకు నిర్వహిస్తున్నారు. ఇకపై పబ్లిక్ పరీక్షల్లో ఈ రెండూ కలిపి ఒక్క పేపర్‌గానే ఇవ్వనున్నారు. మార్కులు సైతం వందకు కుదిస్తున్నారు. దీంతో వచ్చే ఏడాది ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులందరూ మ్యాథమెటిక్స్ ఒక్క పేపర్ వంద మార్కులకు పరీక్ష రాయాల్సి ఉంటుంది. అలాగే భౌతిక, రసాయనశాస్త్రాలు ఇప్పటివరకు 60 మార్కుల చొప్పున ఉండగా.. ఈ మార్కులు 85కి పెరిగాయి. మొదటి ఏడాదిలోని 15 మార్కులు, రెండో ఏడాదిలోని 15 మార్కులు కలిపి 30 మార్కులకు ప్రాక్టికల్స్ ఉంటాయి.

# సంపాదకీయం

## విభజన కుట్ర

'స్టాలిన్ దున్నపోతు ఈనిందని అందరికీ ఆహ్వానాలు పంపితే దక్షిణాదికి చెందిన ప్రాంతీయ పార్టీల నేతలు ఆ దూడను కట్టేయడానికి చెన్నైకి పరుగులు పెట్టారు.' లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాదికి అన్యాయం జరిగిపోతోందంటూ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఏర్పాటు చేసిన సమావేశం అచ్చంగా ఇలాగే జరిగింది. అన్యాయం జరిగిపోతోందని బీజేపీని గుడ్డిగా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకున్న పార్టీలు ఆ సమావేశానికి వెళ్లాయి.

చెన్నైలో ఓ స్టార్ హోటల్‌లో కోట్లు ఖర్చు పెట్టి నిర్వహించిన సమావేశంలో ఒక్కరంటే ఒక్కరైనా ఎలా అన్యాయం జరుగుతుందో చర్చించారా? జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల విభజన జరుగుతుందనీ, దక్షిణాదిలో జనాభా తగ్గిపోయారనీ, ఉత్తరాదిలో పెరిగిపోయారనీ, అందుకే దక్షిణాదికి సీట్లు తగ్గుతాయనీ వీరంతా ఓ నిర్ణయానికి వచ్చేశారు.

నిజానికి ఈ ప్రక్రియలో ఇంతవరకూ ఒక్క అడుగు కూడా పడలేదు. ముందుగా జనాభా లెక్కలు పూర్తి చేయాలి. అప్పుడే ఉత్తరాదిలో ఎంత పెరిగారు, దక్షిణాదిలో పెరిగారా, తగ్గారా అన్న స్పష్టత వస్తుంది. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ ఏర్పాటవుతుంది. జనాభా లెక్కల ప్రకారమే పునర్విభజన చేస్తారన్నది కూడా అపోహే! అలా అయితే ఈశాన్య రాష్ట్రాలకు 25 లోక్‌సభ సీట్లు ఉండేవా?

ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని పదే పదే చెబుతున్న ప్రధాని, కేంద్ర హోంమంత్రి... ఏ రాష్ట్రానికీ ఒక్క సీటు కూడా తగ్గదని వివిధ సందర్భాల్లో స్పష్టం చేశారు. 2023లో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ డీలిమిటేషన్ ప్రక్రియను 2026 తర్వాత జనగణన డేటా ఆధారంగా చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తోందని ప్రకటించారు. ప్రతి ఓటరుకూ సమాన ప్రాతి నిధ్యం లభించేలా చేస్తామన్నారు.

ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడేలా డీలిమిటేషన్ ఉంటుందన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్థానిక జనాభా వైవిధ్యం, గిరిజన సముదాయాల ప్రాతినిధ్యాన్ని కాపాడేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 'డీలిమిటేషన్ అనేది కేవలం స్థానాల సంఖ్యను పెంచడం లేదా తగ్గించడం కాదు, ప్రజాస్వామ్యంలో సమానత్వాన్ని స్థాపించే ప్రక్రియ' అని స్పష్టం చేశారు

**రాజకీయ అలజడి కోసమే...**

అయినా దక్షిణాదిలోని కొన్ని ప్రాంతీయ పార్టీలు కాకి లెక్కలను ప్రచారం చేస్తున్నాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలకు 42 లోక్‌సభ స్థానాలుంటే, పునర్విభజన తరు వాత 34 అవుతాయని చెబుతున్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు ప్రస్తుతం 129 స్థానాలుంటే వీటి సంఖ్య 103కు పడిపోయే అవకాశం ఉందని చెబుతున్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజ స్థాన్, బిహార్ రాష్ట్రాలలోని స్థానాల సంఖ్య 174 నుంచి 204 స్థానాలకు చేరుకుంటుందని అంటున్నారు. నిజానికి ఈ లెక్కలు ఇచ్చింది ఓ విదేశీ సంస్థ. 'కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్' అనే సంస్థ 'ఇండియాస్ ఎమర్జింగ్ క్రైసిస్ ఆఫ్ రిప్రజెంటేషన్' అనే నివేదిక సిద్ధం చేసింది. ఈ నివేదిక తప్ప, డీలిమిటేషన్ సీట్లపై మరో రిపోర్టు లేదు.

కేంద్రం నుంచి అసలు లేదు. అయినా ఓ విదేశీ సంస్థ రిపోర్టును పట్టుకుని దేశంలో రాజకీయ అలజడి రేపడానికి డీఎంకే ప్రయత్నిస్తూంటే, ఆ పార్టీ ట్రాప్‌లో ఇతర పార్టీలు పడుతున్నాయి. డీలిమిటేషన్ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదనీ, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయమూ తీసు కోలేదనీ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి కూడా స్పష్టం చేశారు. లోకసభ నియోజకవర్గాల పునర్విభజన గతంలో 2002లో ప్రారంభమైంది.

2008లో అమలులోకి వచ్చింది. ఈ ప్రక్రియ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 ప్రకారం జరిగింది. 2002లో డీలిమిటేషన్ చట్టం ఆమోదించిన తర్వాత, సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక కమిషన్ ఏర్పాటు చేశారు. ఈ కమిషన్‌లో ఎన్నికల కమిషన్ సభ్యులు, రాష్ట్రాల నుండి ప్రతినిధులు ఉన్నారు. 2001 జనాభా లెక్కల ఆధారంగా ప్రతి రాష్ట్రంలో లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల సంఖ్యను సమన్వయం చేశారు.

దీని ప్రకారం, జనాభా పెరుగుదలకు అనుగుణంగా నియోజకవర్గాల సరిహద్దులు సవరించారు. మొత్తం లోక్‌సభ స్థానాల సంఖ్య మాత్రం మారలేదు. నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ వివిధ రాష్ట్రాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు, పౌరుల నుండి సూచనలు స్వీకరించింది. ఈ సూచనలను పరిగణనలోకి తీసుకుని, సరిహద్దులను ఖరారు చేశారు. ఇప్పుడు కూడా అలాగే జరుగుతుంది. ఇంకా విస్తృత సంప్రతింపులకు కమిటీలు వేస్తారు.


**పరుష వ్యాఖ్యలు ఎందుకు?**

ఉత్తరాదివాళ్ళు పందుల్ని కన్నట్లుగా పిల్లల్ని కంటున్నారనీ, అక్కడ బహుభర్తృత్వం ఉంటుందనీ డీఎంకేకు చెందిన మంత్రి దురై మురుగన్ వ్యాఖ్యానించారు. ఉత్తరాదివారిని కించపరిచి తమిళనాడు డీఎంకే నేతలు ఏం సాధించాలనుకుంటున్నారు? ఉత్తరాది వారిలో దక్షిణాదిపై ఏకపక్షంగా వ్యతిరేకత పెంచే కుట్రలో భాగంగానే ఇలాంటి పనులు చేస్తున్నారు. తమిళనాడు డీఎంకే పాలన నాలుగేళ్లు నిండ కుండానే ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుంది. అందుకే ఉత్తరాదిపై విషం చిమ్మి, వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో దక్షిణాది సెంటిమెంటుతో గెలవాలనుకుంటున్నారు.

హక్కుల కోసం పోరాటం చేయడం ప్రజాస్వామ్య హక్కు. కానీ ప్రాంతాల వారీగా భావోద్వేగాలు కలిగి ఉండే సమస్యల పట్ల పోరాడేటప్పుడు, విభజనవాదం చెలరేగే ప్రమాదం ఉంది. ప్రత్యేక ద్రవిడ దేశం కావాలని గతంలో కొంత మంది తమిళ నేతలు ప్రకటనలు కూడా చేశారు. ఇలాంటి విభ జనవాదుల మధ్య దేశాన్ని సమైక్యంగా ఉంచుకోవడం ఇప్పుడు అత్యంత ముఖ్యం. ప్రత్యేక దేశం అనే మాట వినిపించిందంటే, అది విభజన వాదమే! దీన్ని ఏ మాత్రం ప్రోత్సహించకుండా,దక్షిణాది తన ప్రాధాన్యాన్ని కాపాడుకునేందుకు పోరాటం చేస్తే అది మంచి ప్రజాస్వామ్య విధానం అవుతుంది.

## తిరుమలలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం





**తిరుమల మార్చి 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తిరుమల శ్రీవారి ఆలయంలో తెలుగు నూతన సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంను టీటీడీ అధికారులు ఘనంగా నిర్వహించారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంను శాస్త్రోక్తంగా నిర్వహించామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. సంవత్సరంలో నాలుగు సార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తామని అన్నారు. శ్రీవారి ఆలయంలో ఉత్సవాలకు ముందు మంగళవారం తిరుమంజనం చేయడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.

**మూలమూర్తికి ప్రత్యేక పూజలు**

ఉగాది, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి, ఆణివార ఆస్థానం తిరుమంజనం కార్యక్రమం నిర్వహిస్తామని, ఆలయ ప్రాంగణం, ఆలయ గోడలు, ఆలయ పైకప్పు, దేవత మూర్తులు, పూజ సామాగ్రిని శుద్ధి చేశామని వివరించారు. మూలమూర్తిపై వస్త్రం కప్పి సుగంధ ద్రవ్యాలతో ఆలయ మొత్తం సంప్రోక్షణ చేశామని కార్యక్రమం అనంతరం మూలమూర్తికి ప్రత్యేక పూజలు, నివేదనలు అర్చకులు సమర్పిస్తారని ఈవో తెలిపారు.

**వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు**

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా మంగళవారం వీఐపీ బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ అధకారులు రద్దు చేశారు. 25వ తేదీన ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు, సిఫార్సు లేఖలు స్వీకరించబడవని అధికారులు తెలియజేశారు. 30న ఉగాది ఆస్థానం ఉంటుందని పేర్కొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతి పై విచారణకు సీఎం ఆదేశం

జరపాల్సిందిగా హోంమంత్రి అనిత ఆదేశించారు.

**పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనుమానాలు**

కాగా, తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గామన్ బ్రిడ్జి రహదారిపై కొంత మూరు నయారా పెట్రోల్ బంకు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ పగాడల మృతిచెందినట్టుగా పోలీసులు చెబుతున్నారు. హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై సోమవారం రాజమహేంద్రవరం బయలుదేరిన ప్రవీణ్ అర్ధరాత్రి సమయంలో కొంతమూరు వద్ద ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. బైక్ అదుపుతప్పి రోడ్డు నుంచి దిగువకు పడిపోవడంతో మోటార్ సైకిల్ ప్రవీణ్‌కుమార్‌పై పడి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. అయితే పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనుమానాలు ఉన్నాయని క్రైస్తవ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

## ఆర్థిక ఇబ్బందులున్నా ఉద్యోగులకి లోటు లేకుండా చేస్తాం: చంద్ర బాబు

నాయుడు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సహకరించాలని సూచించారు.

**ఆర్థిక ఇబ్బందుల మధ్య ఉద్యోగుల సంక్షేమం**

ప్రస్తుతం ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ, ఉద్యోగుల హక్కులను కాపాడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రానికి ఆదాయ వనరులు పరిమితంగానే ఉన్నా, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను దశల వారీగా చెల్లించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే రూ.7,230 కోట్లను విడుదల చేసిన ప్రభుత్వం, మిగిలిన బకాయిలను కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి విడతలుగా చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, వారికి రావాల్సిన అన్ని సౌకర్యాలను సమయానికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ఉద్యోగుల సహకారం కూడా అవసరమని, ప్రజల్లో ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా విపరీతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత వారిపైన ఉందని చంద్రబాబు నాయుడు సూచించారు.

**ప్రభుత్వ కార్యక్రమాల్లో ఉద్యోగుల భాగస్వామ్యం**

ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి అండగా ఉండాలని, ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతనూ నెరవేర్చాలని సీఎం సూచించారు. ముఖ్యంగా "పీ4 కార్యక్రమం" లో ఉద్యోగులు భాగస్వామ్యం కావాలని కోరారు.

**పేదల సంక్షేమానికి ఉద్యోగుల సహకారం**

ఉద్యోగుల కుటుంబాలు కూడా తమకు చేతనైనంత మేరకు ఒక పేద కుటుంబాన్ని పైకి తీసుకురావడానికి కృషి చేయాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. వారి సహకారంతో సమాజంలో మార్పు తీసుకురావడం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.

ఆన్లైన్ బెట్టింగ్ ఆపేందుకు ప్రత్యేక చట్టం %-% సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో నేరాలను అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో, ఆన్లైన్ బెట్టింగ్‌ను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని ఆయన ప్రకటించారు. బెట్టింగ్ కారణంగా అనేక మంది ఆర్థికంగా నష్టపోతున్నారని, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల భద్రత, సామాజిక సమతుల్యత కోసం ప్రభుత్వ విధానాలను మరింత కఠినతరం చేయాలని సీఎం తెలిపారు.

**నేరాలను తగ్గించేందుకు ఆధునిక టెక్నాలజీ**

నేరాలను నియంత్రించేందుకు ఆధునిక టెక్నాలజీ వినియోగం అత్యంత కీలకమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పోలీస్ వ్యవస్థ ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నేర పరిశోధనలో అధునాతన టూల్స్, ఫోరెన్సిక్ సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. నేరస్థులు తెలివిగా ఆధారాలను దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా న్యాయవ్యవస్థను మరింత సమర్థంగా మార్చాలని సీఎం అన్నారు.

**ఫోరెన్సిక్ సాక్ష్యాల ప్రాముఖ్యత**

చంద్రబాబు ప్రసంగంలో ఫోరెన్సిక్ సాక్ష్యాల ప్రాముఖ్యతకు ప్రత్యేకంగా ప్రస్తావన వచ్చింది. యేఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును ఉదాహరణగా చూపిస్తూ, నేరస్థులు ఆధారాలను నాశనం చేయడాన్ని నివారించేందుకు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రతి క్రైమ్ సీన్ నుంచి ఫోరెన్సిక్ ఎవిడెన్స్‌ను సమర్థంగా సేకరించి, న్యాయపరంగా ఉపయోగించుకోవాలని సూచించారు.

**ఆన్‌లైన్ జూదానికి బలైన ముగ్గురు**

రాష్ట్రంలో నేరాలను తగ్గించేందుకు ప్రభుత్వం కొత్త విధానాలను అమలు చేయనుంది. ఆన్లైన్ బెట్టింగ్‌పై పూర్తిగా నిషేధం విధించేందుకు త్వరలోనే ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నట్లు సీఎం వెల్లడించారు. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. పోలీస్ శాఖ మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు అవసరమైన అన్ని వనరులను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

## కొడాలి నానికి గుండెపోటు ఆస్పత్రికి తరలింపు

ఆరోగ్య పరిస్థితి గురించి అధికారికంగా ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

**వైసీపీ శ్రేణుల్లో ఆందోళన**

కొడాలి నాని ఆసుపత్రిలో చేరిన వార్త తెలియగానే, వైసీపీ శ్రేణులు, ఆయన అనుచరులు టెన్షన్‌కు గురయ్యారు.ఇప్పుడు ఆయన ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలియకపోవడంతో, ఆయన అభిమానులు ఆందోళన చెందుతున్నారు. అసలు కొడాలి నాని ఆరోగ్యానికి సంబంధించి డాక్టర్లు ఏం చెబుతారు? అనేది ఆసక్తికరంగా మారింది. వైద్య పరీక్షల అనంతరం, ఆసుపత్రి వర్గాలు అధికారిక ప్రకటన చేసే అవకాశం కనిపిస్తోంది.కొడాలి నానికి గతంలో గుండె సంబంధిత సమస్యలు ఉన్న నేపథ్యంలో, ఇప్పుడీ ఛాతీ నొప్పి గుండె సమస్య కారణంగా వచ్చిందా? లేక సాధారణ అస్వస్థత మాత్రమేనా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

**హైదరాబాద్ లో నివాసం**

ప్రస్తుతం హైదరాబాద్ లో ఉంటున్న కొడాలి నాని ఛాతీ నొప్పికి గురయ్యారు. దీంతో, ఆయన కుటుంబ సభ్యులు ఆయనను హుటాహుటిన గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు.హార్ట్ అటాక్ గుండెకు రక్త సరఫరా నిలిచిపోయినప్పుడు జరిగే ప్రాణాంతకమైన పరిస్థితి. ఇది సాధారణంగా రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం, రక్తం గడ్డకట్టడం వంటి సమస్యల వల్ల కలుగుతుంది.

## ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం 'ఉగాది కానుక'

లాంఛనంగా ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు మేలు చేయనున్న ముఖ్యమైన సంక్షేమ పథకంగా నిలవనుంది.

**ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు**

సన్నబియ్యం పంపిణీ పథకం ఉగాది నాడు ప్రారంభమైన తర్వాత, ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాల్లో అమలులోకి రానుంది. ఇప్పటి వరకు రేషన్ షాపుల్లో దొడ్డు బియ్యం మాత్రమే అందుబాటులో ఉండేది. అయితే, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, అధిక నాణ్యత కలిగిన సన్నబియ్యాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇది 2.82 కోట్ల మంది రేషన్ కార్డు దారులకు ప్రత్యక్ష లబ్ధి కలిగించే పథకంగా మారనుంది.

**ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని**

ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం వెనుక ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం మరియు పోషకాహార విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించడం. సన్నబియ్యం తినడం వల్ల ఆరోగ్య పరంగా ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం తన ప్రజలకు మంచి ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

**రేషన్ షాపుల ఏర్పాట్లు పూర్తి**

సన్నబియ్యం పంపిణీ పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం అన్ని రేషన్ షాపుల్లో ఏర్పాట్లు పూర్తి చేసింది. సరఫరా ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రత్యేక మోనిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం ఈ పథకం ద్వారా లబ్ధిపొందేలా చర్యలు తీసుకుంటున్నామని, పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రత్యేక అధికారి నియామకాలు జరుగుతున్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## ఈనెల 28న ప.గో జిల్లాలో పవన్ పర్యటన

సక్రమంగా అమలవుతున్నాయా లేదా అనే అంశంపైనా చర్చించనున్నారు.

**పవన్‌కు మొగల్తూరుతో ప్రత్యేక అనుబంధం**

పవన్ కళ్యాణ్ కుటుంబ మూలాలు మొగల్తూరుకు చెందినవే కావడంతో, ఆయనకు ఈ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉంది. జనసేన పార్టీ స్థాపన నుంచీ, ఈ ప్రాంతం ఆయనకు పెద్ద స్థాయిలో మద్దతునిస్తోంది. తన స్వగ్రామ ప్రజలకు ప్రభుత్వ పాలనను మరింత సమీపం చేయాలని పవన్ కళ్యాణ్ ఉద్దేశ్యంతో ఈ పర్యటన చేపడుతున్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

జనరల్ న్యూస్

https://epaper.teluguraastram.com

అమలాపురం
మార్చి 27,
గురువారం 2025



# పికిల్ బాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రదానం




**విశాఖపట్నం మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**విశాఖ వేదికగా ఈనెల 21, 22, 23 తేదీల్లో మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ లో అతిపెద్ద పికిల్ బాల్ టోర్నమెంట్ ను "బాటిల్ ఆఫ్ ది పాడిల్స్" పేరుతో నిర్వహించారు. ఈ టోర్నమెంట్ లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.**

మంచి క్రీడా వాతావరణంలో జరిగిన ఈ టోర్నమెంట్ కు సంబంధించి ఫైనల్స్ హెూరాహెూరీగా జరిగాయి. మెన్స్ సింగిల్స్, మెన్స్ డబుల్స్, మిక్స్ డబల్సు మూడు కేటగిరీల్లో ఈ ఆటలు నిర్వహించారు.

మెన్స్ సింగిల్స్ లో హైదరాబాద్ కు చెందిన సమీర్ వర్మ, మిక్స్ డబుల్స్ లో విశాఖపట్నం కు చెందిన అనంత్ అండ్ హర్షిణి, మెన్స్ డబుల్స్ లో హైదరాబాద్ కు చెందిన సమీర్ వర్మ, ప్రజీత్ లు విజేతలుగా నిలిచారు. బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ మాట్లాడుతూ ఇటువంటి టోర్నమెంట్ లు నిర్వహించడం వల్ల విశాఖకు జాతీయస్థాయిలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఇటువంటి క్రీడా పోటీలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహించాలని కోరారు. టోర్నమెంట్ నిర్వాహకులు పూజిత, డాక్టర్ బొత్స సందీప్ లను అభినందించారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ పికిల్ బాల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మాడుగుల సంత ప్రదేశంలో రాకపోకలకు అవస్థలు

**విశాఖపట్నం మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**మండల కేంద్రమైన మాడుగుల వారపు సంతలో నిర్వహించే ప్రదేశంలో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కూరగాయల దుకాణాలను రోడ్డుపైనే వేయడంతో సొంత ప్రదేశము ఇరుకుగా మారుతుంది. మాడుగుల వారపు సంతలకు ఇరవై 30 గ్రామాల నుండి ప్రజలు తరలివస్తూ ఉంటారు.**

దీంతో సంతలో ఉన్న తారు రోడ్డు ప్రదేశం అంతా కూరగాయలు కొనుగోలుదారులతో ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. సొంత ఆశీర్ల పాటను లక్షల రూపాయలలో పాడినప్పటికీ అమ్మ కుందార్లకు సరైన సదుపాయం స్థానిక పంచాయతీ కల్పించకపోవడం పట్ల గ్రామస్తులు పరిశీలకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పంచాయతీ పాలకవర్గం స్పందించి సంత ప్రదేశంలో వాహనాల రాకపోకులకు వీలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# ఆస్తి పన్ను చెల్లించి 50 శాతం వడ్డీపై రాయితీని పొందండి

## జిల్లా కలెక్టర్ మరియు జీవీఎంసీ ఇన్చార్జ్ కమిషనర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్

**విశాఖపట్నం మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని గృహ యజమానులకు/ ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ముఖ్య విజ్ఞప్తి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆస్తిపన్ను చెల్లింపు పై 50 శాతం వడ్డీ మాఫీ చేస్తూ జి.ఓ.యం.యస్. నెం.46 ఎం.ఏ. %డ% యు.డి. (సి2) డిపార్టుమెంటు, తేది 25.03.2025న ఉత్తర్వులు మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ మరియు జీవీఎంసీ ఇన్చార్జి కమిషనర్ ఎంఎన్ హరింధిర ప్రసాద్ మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా పేర్కొన్నారు.**

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి, జి.వి.యం.సి. కి చెల్లించవలసిన ఇంటిపన్నులు, ఖాళీ జాగా పన్నుల బకాయిలు మరియు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అనగా 2024-25 సంవత్సరంనకు చెల్లించవలసినవి, తేది 31.03.2025 లోగా ఒకే మొత్తముగా చెల్లించిన యెడల వాటిపై విధించబడిన వడ్డీనందు 50 శాతం మినహాయింపును పొందవచ్చును అన్నారు.

కావున, విశాఖ నగర పరిధిలోని గృహ యజమానులు/ ఆస్తిపన్ను చెల్లింపుదారులు ప్రభుత్వం కల్పించిన ఈ సదావకాశం వినియోగించుకొని జి.వి.యం.సి.కి చెల్లించవలసిన ఇంటిపన్నులు,



ఖాళీ జాగా పన్నుల బకాయిలు వెంటనే చెల్లించి, 50 శాతం వడ్డీ రాయితీని పొందవలసినదిగా కోరడమైనదని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. ఈ సదావకాశం తేది 31.03.2025 వరకు మాత్రమేనని తెలియజేశారు.

నగర ప్రజలు సౌకర్యార్థం, ప్రతీ వార్డు సచివాలయ పరిధిలోని ప్రతీ గృహ ఇంటి యజమానిని వారి గృహము వద్దనే వార్డు సచివాలయ కార్యదర్శి వచ్చినప్పుడు / సంప్రదించినప్పుడు వారి యొక్క ఆస్తిపన్ను బకాయిలను డెబిట్ / క్రెడిట్ కార్డ్ లేదా యు.పి.ఐ. ద్వారా గాని చెల్లింపులు జరుపవచ్చునన్నారు. మరియు ఈ దిగువ బ్యాంకులు మరియు జి.వి.యం.సి ప్రధాన కార్యాలయం అలాగే అన్ని జోనల్ కార్యాలయాల్లో సౌకర్యం కేంద్రముల వద్ద ఆస్తిపన్ను చెల్లింపుదారులు తమ పన్ను బకాయిలను పని వేళల్లో చెల్లించవచ్చునని తెలిపారు.

1. ఐడిబిఐ-సిరిపురం బ్యాంక్ బ్రాంచ్
2 ఐ.సి.ఐ.సి.ఐ.-ద్వారకానగర్ బ్రాంచ్
3. పంజాబ్ నేషనల్ బ్యాంకు-మధురవాడ బ్రాంచ్
4. యాక్సిస్ బ్యాంకు-రామ్ నగర్ బ్రాంచ్ పనివేళలో అలాగే
5. జి.వి.యంసి. ప్రధాన కార్యాలయము మరియు

తేది 31.03.2025 వరకు ఆదివారం మరియు అన్ని జోనల్ కార్యాలయములలో గల సౌకర్యం కేంద్రములు. సాధారణ సెలవు దినములలో కూడా ఉదయం గం.8.00 లనుండి సాయంత్రం గం.8.00 ల వరకు పనిచేయబడునని అన్నారు. కావున నగరములోని గృహ / ఇంటి యజమానులు జి.వి.యం.సి.కి చెల్లించవలసిన ఇంటిపన్నులు, ఖాళీ జాగా పన్ను చెల్లింపు దారులు ఈ సదావకాశమును వినియోగించుకొని తేది 31.03.2025 లోగా చెల్లించి వడ్డీ రాయితీని పొంది నగర అభివృద్ధిలో కార్పొరేషన్ కు చేయూతనందించ వలసినదిగా జిల్లా కలెక్టర్ తెలియజేశారు.

# టీటీడీకి రూ.1.01 కోట్లు విరాళం



**విశాఖపట్నం మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాజమహేంద్రవరానికి చెందిన తిరుమల విద్యా సంస్థల చైర్మన్ శ్రీ నున్న తిరుమలరావు, శ్రీమతి నున్న సరోజినిదేవి దంపతులు శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు బుధవారం రూ.1,01,11,111/- విరాళంగా అందించారు

# ఘనంగా వీరాంజనేయ స్వామి వారి తీర్థం



**విశాఖపట్నం మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మాడుగుల మండలం ఎం కోటపాడు ఎం కె వల్లాపురం గ్రామా లో వెలసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ వీరాంజనేయ స్వామి వారి తీర్థ మహెూత్సవం సందర్భంగా స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి పోటీలలో పాల్గొని గెలిచిన వారికీ బహుమతులు ప్రధానము చేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ,అనకాపల్లి టిడిపి జిల్లా అధ్యక్షులు హెూసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్య బాబు ,కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు యువత, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయం, సహకార శాఖ, మార్కెటింగ్, పశుసంవర్ధకశాఖ, డెయిరీ డెవలప్మెంట్, మరియు మత్స్యశాఖ మాత్యులు శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు అనంద్ బాబు గొల్లంగి రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు!**

## అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని వినతి

**రాష్ట్ర అధ్యక్షులు పల్లాకు వినతిపత్రం అందించిన రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పెదపూడి**



**అంబాజీపేట మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలంటూ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి, సీనియర్ టిడిపి నాయకులు పెదపూడి శ్రీనివాసరావు బుధవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పళ్ళ శ్రీనివాసరావు ను అభ్యర్థించారు. టిడిపి వ్యవస్థాపకం నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తూ దరఖాస్తు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ను శాలువా కప్పి సత్కరించారు. ఆయన వెంట దొమ్మేటి ప్రభాకరరావు, పెచ్చిట్టి శివ సత్య హరిబాబు లు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లను పరిశీలించిన ఎమ్మెల్యే





**అమలాపురం, మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
అన్నా క్యాంటీన్, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లను పరిశీలించిన గౌరవ శాసనసభ్యులు శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీ మెట్ల రమణబాబు గారు, ఆముడా చైర్మన్ శ్రీ అల్లాడ స్వామి నాయుడు గారు ఈ కార్యక్రమంలో బొర్రా వెంకటేశ్వరరావు, ఆశెట్టి ఆదిబాబు, యెడిద శ్రీను, నల్లా మల్లిబాబు,వలవల శివరావు,పిండి రాజా,గంధం శ్రీను, సుమన్ వర్మ మరియు కూటమి నాయకులు

## పాస్టర్ ప్రవీణ్ మృతి పై న్యాయ విచారణ జరిపించాలి

**మలికిపురం మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



పాస్టర్ పగడాల. ప్రవీణ్ మృతి పై న్యాయవిచారణ విచారణ చేయాలి.దళిత హక్కుల పోరాట సమితి ( డి హెచ్ పి ఎస్ ) జిల్లా గౌరవాధ్యక్షుడు దేవ. రాజేంద్రప్రసాద్ డిమాండ్.
వారం రోజుల క్రితం తనకు ప్రాణహాని ఉందని, బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని చెప్పినా పోలీసులు సరిగా స్పందించక పోవడంతో పాస్టర్ ప్రవీణ్ మృతి ప్రమాధవశాత్తు జరిగిందా? ఎవరైనా హత్యాచేశారా? అనే విషయం నివృత్తి కావాలంటే ప్రస్తుత న్యాయమూర్తి చేత విచారణ చేయాలని దళిత హక్కుల పోరాట సమితి అంబేద్కర్ కోనసీమ జిల్లా గౌరవాధ్యక్షులు దేవ.రాజేంద్రప్రసాద్,జిల్లా అధ్యక్షుడు నల్లి.బుజ్జిబాబు,కార్యదర్శి మోకా.శ్రీనివాసరావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రవీణ్ కు తగిలిన గాయాలను బట్టి ఇదిహత్యా,? ప్రమాదమా అనే అనుమానాలు కలుగుతున్నాయని,ప్రవీణ మృతి నిగ్గుతేలాలంటే నిష్పాక్షపాతంగా పోలీసులు విచారణ చేయాలని,పోస్టుమార్టం రిపోర్ట్ రాకుండానే ప్రమాదవశాత్తు మరణించారని చెప్పడం అనుమానాలకు తావిస్తుందని అన్నారు.పాస్టర్ ప్రవీణ్ మృతి పట్లజిల్లా దళిత హక్కుల పోరాట సమితి సంతాపం వ్యక్తం చేసింది.ఆయన కుటుంబ సభ్యులకు రాజేంద్రప్రసాద్ ప్రఘాడ సానుభూతి తెలిపారు.

## పొన్నాడ ఒంటెద్దు పోకడతో పార్టీకి దూరం కానున్న శెట్టిబలిజ సామాజికవర్గం...



**కాట్రేనికోన మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
కాట్రేనికోన మార్చి 26(గోదావరి విలేకరి):ముమ్మిడివరం నియోజకవర్గంలో వైసిపిలో ముసలం పుట్టింది. నియోజకవర్గంలో భారీగా ఓట్లుకలిగిన శెట్టిబలిజ సామాజిక వర్గీయులు ఇంతవరకూ వైసిపికి అత్యంత విధేయులుగా ఉండగా, పొన్నాడ ఒంటెద్దు పోకడతో పార్టీకి దూరం కానున్నారు.. ఇటీవల కాట్రేనికోన మండల ఎంపిపి పాలెపు లక్ష్మి అనారోగ్యంతో మృతిచెందారు. బి.సి సామాజిక వర్గ మహిళకు కేటాయింపబడిన ఆ స్ధానానికి ఎన్నిక జరగడం అనివార్యం కావడంతో... బి.సి సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు మహిళలు మాత్రమే ఎంపిటిసి సభ్యులుగా కొనసాగుతున్నారు. వీరిలో ఒకరు మాజీ ఎమ్.ఎల్.ఎ సొంత సామాజిక వర్గానికి చెందిన మత్సకార మహిళకాగా, మరొకరు శెట్టిబలిజ సమాజిక వర్గానికి చెందిన మహిళ.. కేవలం పద్నాలుగు నెలలు పదవీకాలం ఉన్న ఎంపిపి స్ధానం తమ సామాజిక వర్గానికి చెందిన మహిళకు కేటాయించమని పొన్నాడను శెట్టిబలిజ నాయకులు కోరగా, పొన్నాడ తన సామాజిక వర్గానికి చెందిన మహిళకే పదవిని కట్టబెడతానని కఠినంగా చెప్పడంతో ఇంతవరకూ పొన్నాడ వెంట నడిచిన వారు ఆవేదన చెందుతున్నారు... ఈరోజు వైసిపి సీనియర్ నాయకులు సంసాని నాగేశ్వరరావు ఇంటివద్ద శెట్టిబలిజ నాయకులు, కార్యకర్తలు సమావేశం అయ్యారు.. ఈ సందర్భంగా మీడియా ముఖంగా పొన్నాడకు పలు ప్రశ్నలు సందించారు. గతంనుండీ పార్టీకి కట్టుపడి మీవెంట నడిచాము, మీలా మాకు కులపిచ్చి ఉండి ఉంటే మేము గుత్తుల సాయికి, లేక కుడుపూడి సూర్యనారాయణ లేక పితాని బాలకృష్ణ వెంట వెళ్లే వారము, కానీ వైసిపి పార్టీకి కట్టుబడి మీవెంట నడిచాము. మేము కనుక మీలా కులగజ్జి చూపిస్తే మీరు అసలు ఎన్నికలలో రెండుసార్లు గెలిచేవారా అంటూ పొన్నాడపై ఆగ్రహం వ్యక్తం చేసారు... బుల్లిరాజు ప్రమేయం గురించి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ఎన్నికలలో ఇదే బుల్లిరాజు, పిల్లంక శ్రీనివాస రాజు లాంటివారు లేకపోతే మీకు అసలు సీటు వచ్చేదా అంటూ ప్రశ్నించారు.. గత ఎన్నికలో వైసిపి ఓటమి పాలయ్యాక నియోజకవర్గంలో పార్టీ పట్టించుకోకుండా, యానాంలో చక్రం తిప్పుతానని అంటున్న పొన్నాడకు శెట్టిబలిజ సామాజికవర్గంనుండి ప్రతిఘటన ఎదురయ్యే అవకాశం కన్పింస్తుంది..రెండుసార్లు శెట్టిబలిజ సమజిక వర్గానికి రావలసిన అవకాశాన్ని గద్దలా తన్నుకుపోయిన పొన్నాడ, ఆ సామాజిక వర్గీయులను దూరం చేసుకుంటే ఇకముందు రాజకీయ భవిష్యత్తు శూన్యం అవుతుందని నియోజకవర్గంలో పలువురు రాజకీయ ప్రముఖులు విశ్లేషిస్తున్నారు...

# రబీ ధాన్యం సేకరణకు సన్నద్ధం కావాలి : జాయింట్ కలెక్టర్ నిషాంతి



**అమలాపురం, మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ప్రస్తుత రబీ సీజన్లో ధాన్యం సేకరణకు సర్వ సన్నద్ధం కావాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులు, మిల్లర్లకు సూచించారు. అమలాపురం కలెక్టరేట్ లో బుధవారం లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో రబీ సీజన్లో ధాన్యం సేకరణ ప్రక్రియ సన్నద్ధతపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు ప్రయోజనాలే లక్ష్యంగా కార్యాచరణ ఉండాలన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని ఆదేవిధంగా రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు పటిష్ట ప్రణాళికతో సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. రబీ ధాన్యం సేకరణకు సంబంధించి బ్యాంక్ గ్యారంటీలు, రెన్యువల్, బఫర్ గోదాముల వినియోగం, తేమ తూనికల పరికరాలు, గోనెసంచులు, రవాణా లేబరు టెక్నికల్ అసిస్టెంట్స్ తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో ఈ-పంట నమోదు ఆధారంగా చూస్తే రబీలో 1,64,854 ఎకరాలలో వరి పంట సాగు చేయడం జరిగిందని, దీని ద్వారా 6,17,000 మెట్రిక్ టన్నుల మేర ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశముందని అన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని అధికారులను అదేశించారు. రబీ ధాన్యం సేకరణకు జిల్లాస్థాయిలో జేసీ చైర్మన్గా ఆర్డీవోలు, పౌరసరఫరాల డీఎం, డి.ఎస్.ఓ, డి.ఏ.ఒ తదితర అధికారులు సభ్యులుగా కమిటీ ఉందన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకొని పని చేయాలని సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన 404 రైతు సేవ కేంద్రాల్లోని కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతు ధర పొందేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు తెలుసుకొని పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. మిల్లుల సామర్థ్యాలను ముందుగానే తనిఖీ ద్వారా అంచనా వేయాలన్నారు. రైతు సంతృప్తి ధ్యేయంగా ప్రతి అంశంలో పారదర్శకత నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని లేని పక్షంలో ఐ.వి.ఆర్.ఎస్ విధానంలో ఫిర్యాదులు ప్రభుత్వానికి వెళతాయని ఆమె స్పష్టం చేసారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో అవకతవకలకు పాల్పడినట్లు రుజువైతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మిల్లర్లు మంచి గోనె సంచులను రైతులకు సరఫరా చేయాలని సూచించారు. ధాన్యం సేకరణ కార్యాచరణ ప్రణాళికలను సమర్థవంతంగా రూపొందించి ఆచరణకు సిద్ధం కావాలన్నారు. రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి, లక్ష్మీ నారాయణలు మాట్లాడుతూ ముందుగానే బాయిల్డ్ రైస్, రా రైస్ లక్ష్యాలను మిల్లర్లకు తెలపాలని, ట్రక్కు సీటు జనరేట్ కాగానే మిల్లర్ల లాగిన్ కు సమాచారం ముందుగానే వచ్చేస్తుందని తదనుగుణంగా సాంకేతిక సమస్యలు ఉత్పన్నవుతున్నాయన్నారు. గోనె సంచులు మిల్లర్లు సరఫరా చేసినప్పటికీ వాటి చార్జీలు రైతు పేరున జమవుతున్నాయని మిల్లర్ల పేరునే జమ కాబడేలా చర్యలు తీసుకోవాలని, అన్లోడ్ కాకుండానే అన్లోడ్ అయినట్టుగా ఆన్లైన్లో చూపుతోందని, జిపిఎస్ కోఆర్డినేట్స్ తదితర సాఫ్ట్ వేర్ సమస్యలను ముందుగానే పరిష్కరించాలని భారత ఆహార సంస్థ, పౌరసరఫరాలశాఖకు ఎంత పరిమాణంలో లక్ష్యాలు నిర్దేశించింది ముందుగా తెలియజేయాలని పాత పెండింగ్ బకాయిలు చెల్లించాలని జాయింట్ కలెక్టర్ ను కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసు బాబు, డి.సి.ఓ.ఎస్. మురళీకృష్ణ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ బాల సరస్వతి, ఏడి మార్కెటింగ్ విశాలాక్షి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ నాగలక్ష్మి, తూనికలు కొలతల కంట్రోలర్ రాజేష్, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## 2 కోట్ల71 లక్షలతో ఆరు వాటర్ ట్యాంక్ ప్రారంభించాం

**రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్**



**మలికిపురం మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
రెండు కోట్ల 71 లక్షల రూపాయలతో నిర్మించిన 6 వాటర్ ట్యాంకులు ప్రారంభోత్సవం రాజోలు మండలంలో రెండు కోట్ల 71 లక్షల రూపాయల జలజీవన్ మిషన్ నిధులతో నూతనంగా నిర్మించిన ఆరు వాటర్ ట్యాంకులను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభోత్సవం చేసి ప్రజలకు అంకితం చేశారు.శివకోడు 120 రాజోలు 60 పొదలాడ 40 బి.సావరం 40 కడలి సెంటర్ 40 కడలి వాసంశెట్టి వారి గ్రూప్ 40 కే ఎల్ రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గం గత రెండు దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైందని మంచినీటి సమస్యను పరిష్కరించాలంటే ముందు కరెంట్ సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్న అని అన్నారు.రీసెంట్ గా గుడిముల 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన. గుడిమెళ్ళంక సబ్ –స్టేషన్ త్వరగా మంజూరు చెయ్యాలని అదనంగా 3 వది శంకరగుప్తంలో కూడా సబ్ స్టేషన్ మంజూరు చెయ్యాలని ప్రతిపాదనలు పంపినారు.నియోజకవర్గానికి అత్యవసరంగా 250 కొత్త ట్రాన్స్ఫార్మర్లు మంజూరు చేయాలని కాలిపోయిన 50 ట్రాన్స్ఫార్మర్ల ను రీప్లేస్ చెయ్యాలని,రాజోలు 33/11 సబ్ స్టేషన్ లో 5 ఎం వి ఏ , పి టి ఆర్ ను 8 ఎం వి ఏ పి టి ఆర్ గా ఇంప్రూవ్ చెయ్యాలని మంచినీటి విషయంలో సుమారు 1650 కోట్ల రూపాయలతో ధవలేశ్వరం గోదావరి నుండి నేరుగా పైప్ లైన్ ద్వారా నీరు సరఫరా చేసి సురక్షిత మంచి నీరు అందించే పథకం త్వరలోనే మంజూరు కాబోతోంది అని తద్వారా మంచినీటి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తాను అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు,ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.









**అమలాపురం ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు నియోజకవర్గ ప్రజల నుండి ఫిర్యాదులు, అర్జీలు స్వీకరించడం జరిగింది.**

అమలాపురం, మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)







# పెండింగ్ పనుల వేగవంతానికి చర్యలు చేపట్టండి



ఏలూరు మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ లో నేషనల్ హైవేకి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి వినయ్ కుమార్ కు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరారు. ఈ మేరకు ఢిల్లీలోని కార్యాలయంలో అదనపు కార్యదర్శి వినయ్ కుమార్ ను ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బుధవారం స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశారు. నేషనల్ హైవేకి సంబంధించి పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులు, నిధులు మంజూరు చేయాల్సిన అభివృద్ధి పనులు, కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్న ప్రతిపాదనలపై అదనపు కార్యదర్శి వినయ్ కుమార్ తో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చర్చించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆర్థిక పరిస్థితిని పరిగణలోకి తీసుకుంటూ జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించి నిధుల మంజూరులో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విన్నవించారు.

**ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో**

నూజివీడు నుంచి ముసునూరు మీదుగా ఏలూరుకు వెళ్లే ఎన్.హెచ్-216 హెచ్ రహదారిలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి ఫ్లై-ఓవర్ నిర్మాణం, ఎన్.హెచ్-216 రహదారిలో 70.385 వద్ద ఉన్న కల్వర్టు నిర్మాణం, మచిలీపట్నం ఓడరేవుకు కార్గో రవాణా చేసే వాహనాల వల్ల ఏర్పడే భారీ ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి తుక్కులూరు నుంచి నూజివీడు మున్సిపల్ ఏరియా చివరి వరకు ఇరువైపులా 6 కి.మీ సర్వీస్ రోడ్డు కనెక్టివిటీ, నూజివీడు నుంచి ముసునూరు మీదుగా ఏలూరు కూడలి వరకు ఫ్లైఓవర్ నిర్మాణం, తుక్కులూరు వద్ద నుంచి హనుమాన్ జంక్షన్ మీదుగా నూజివీడు 216 హెచ్ రహదారి 69 కి.మీ వరకు మరో ఫ్లైఓవర్ నిర్మాణం, జీలుగుమిల్లి నుంచి కొవ్వూరు వయా కన్నాపురం వరకు ప్రతిపాదిత జాతీయ రహదారి 365 బీబీ ప్రాజెక్ట్ హైవే అలైన్‌మెంట్‌ను కన్నాపురం ఆనుకుని బైపాస్ రోడ్డుగా మార్చారని, కాబట్టి పాత అలైన్‌మెంట్‌ను పునఃపరిశీలించాలని, కైకలూరు నియోజకవర్గంలోని వడ్లమన్నాడు- పెదలంక వయా గురువాయుపాలెం, సంతోషపురం, భాస్కరావుపేట, పెదలంక ఎస్.హెచ్-304, ఎస్.హెచ్-231 పరిధిలోని వడలి- తాడినాడ, భీమవరం- గుడివాడ, కైకలూరు- కలిదిండి రహదారుల విస్తరణ, అభివృద్ధికి సిఆర్ఐఎఫ్ పథకం కింద రూ.289.00 కోట్లు మంజూరు, నూజివీడు, చింతలపూడి, పోలవరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో శిధిలావస్థకు చేరి దెబ్బతిన్న సింగిల్ లేన్ రహదారులను డబుల్ లేన్‌గా 7 మీటర్లు మేర అభివృద్ధి, రవికంపాడు, చింతలపూడి, దిగవల్లి- వలసపల్లి రహదారుల విస్తరణకు సిఆర్ఐఎఫ్ నిధులు రూ.101 కోట్లు మంజూరు, ఎన్ హెచ్ 216ఎ, 365బీజీ, ఎన్ హెచ్ 16పై లింగగూడెం, కమలాపురం, రాఘవాపురంలో పామాయిల్ రైతులు పండించిన పంట ఉత్పత్తులు తరలించడానికి వీలుగా కనెక్టివిటీ రోడ్డు నిర్మాణం, ఖమ్మం నుండి దేవరాపల్లి ఎన్.హెచ్ 365 బీజీ గ్రీన్‌ఫీల్డ్ హైవే అభివృద్ధి నేపథ్యంలో కనెక్టివిటీ రోడ్డు నిర్మాణం, ఏలూరు జిల్లా పరిధిలోని ఖమ్మం-దేవరపల్లి 365 బిజి నేషనల్ హైవే గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్ వెంబడి సర్వీస్ రోడ్ల నిర్మాణం, ఖమ్మం-దేవరపల్లి ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంలో ఉన్న 4-లేన్ యాక్సెస్-నియంత్రిత హైవే మరియు చింతలపూడి మండలం గురుబట్లగూడెం నుంచి రేచర్ల-గురవాయిగూడెం వరకు సర్వీస్ రోడ్ల నిర్మాణం, దెందులూరు మండలం సీతంపేట ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, గుండుగొలను నుండి కొవ్వూరు రోడ్డు వరకు ఎన్. హెచ్-16లో సీతంపేట జంక్షన్ వద్ద 4 మీటర్ల ఎత్తు బాక్స్ కల్వర్ట్ లేదా పీయుపీ, సీయుపీ నిర్మాణం, గుండుగొలను దేవరపల్లి-కొవ్వూరు జంక్షన్లో ఓవర్‌బ్రిడ్జి మధ్య సర్వీస్ రోడ్డు, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, రైల్వే ఓవర్ బ్రిడ్జి నుండి గుండుగొలను వరకు నిర్మించిన సర్వీస్ రోడ్ల వెంబడి లైటింగ్‌ను మెరుగుపరచడం, ఉంగుటూరు నియోజకవర్గంలోని గుండుగొలను, భీమడోలు, కూరెళ్లగూడెం, పూళ్ల, కైకరం, చేబ్రోలు, నారాయణపురం, ఉంగుటూరు రెండు కిలోమీటర్ల మేర ఫ్లైఓవర్, సబ్ వేల నిర్మాణం, ఏడు బ్లైండ్ స్పాట్ ప్రాంతాల్లో సర్వీసు రోడ్డుతో కలిగిన ఫ్లై ఓవర్ల నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అదనపు కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. అదనపు కార్యదర్శి వినయ్ కుమార్ సానుకూలంగా స్పందించిన అభివృద్ధి పనులకు నిధుల మంజూరు, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు.


# పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పై సమగ్ర విచారణ జరిపించాలి

ఏలూరు మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పై సమగ్ర విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు పి జీవన్ కుమార్ డిమాండ్ చేశారు. ఏలూరులోని సత్రంపాడులో గల గెత్సేమనే సెంట్రల్ చర్చిలో పాస్టర్ అసోసియేషన్ వారు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జీవన్ కుమార్ మాట్లాడుతూ యావత్ భారతదేశనికి దిగ్భ్రాంతికి గురిచేసిన ప్రవీణ్ ప్రగడాల మృతి చాలా బాధాకరమని అన్నారు. విజయవాడ నుంచి రాజమండ్రి వెళ్లే మార్గంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల హైవేపై రక్తపు మడుగులో మృతి చెంది ఉన్నారు. గత నెల రోజుల క్రితం ఆయన సోషల్ మీడియా వేదికగా తనకు ప్రాణహాని ఉందని చెప్పడం, చెప్పిన నెలరోజులకే ఆయన మృతి చెందడం అనుమానాలకు తావిస్తుందని అన్నారు. అదేవిధంగా ఆయన హెల్మెట్ పెట్టుకొని ఉన్నా సరే మొఖంపై బలమైన గాయం ఎలా తగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ ప్రొటెక్షన్ బిల్లును తీసుకురావాలని కోరుతున్నామన్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతి పై సమగ్ర విచారణ జరిపించి వారి కుటుంబాలకు తగిన న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు సిటీ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల జోసెఫ్, సభ్యులు పీటర్, పాస్టర్ కిరణ్ పాల్, ఏలూరు సిటీ పాస్టర్స్ కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.



# సుంకర అప్పారావు సంస్మరణ సభ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



రాజమహేంద్రవరం మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఈనెల 30వ తేదీన రాజమహేంద్రవరంలో నిర్వహించ తలపెట్టిన కాకినాడ మాజీ మున్సిపల్ చైర్మన్ సుంకర అప్పారావు 49వ వర్ధంతి సభ ఆహ్వాన పత్రాన్ని సీనియర్ న్యాయవాది రావిపాటి రాధాకృష్ణ బుధవారం మధ్యాహ్నం రాజమండ్రి బారాసోసియేషన్ ఆవరణలో ఆవిష్కరించినట్లు న్యాయవాది అంబేద్కర్ తెలిపారు.

# ఏపీని డిజిటల్ ఎడ్యుకేషన్ హబ్ గా తిరిదిద్దేందుకు ప్రభుత్వం కృషి...

## ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల...



రాజమహేంద్రవరం మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

నవ్యాంధ్రప్రదేశ్ ను డిజిటల్ ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. రూరల్ మండలం కాతేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ను ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ విరాళంగా అందజేసి కంప్యూటర్లతో పాఠశాలలో ల్యాబ్ ను ఏర్పాటు చేసుకోవడం శుభ పరిణామం అన్నారు. అలాగే బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ అధినేత కృష్ణ పాడిశెట్టి కంప్యూటర్ ల్యాబ్ ను నిర్వహిస్తూ విద్యార్థులలో చైతన్యం తెచ్చేందుకు అవేర్నెస్ ప్రోగ్రాం లు నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. నవ్యంధ్రప్రదేశ్ ని డిజిటల్ ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని గోరంట్ల ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అందుకు బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ వారి ప్రయత్నం సఫలీకృతం కావాలని ఎమ్మెల్యే గోరంట్ల ఆకాంక్షించారు. బీ.సీ.ఎఫ్ మేనేజర్ జిడ్డు సూర్య మాట్లాడుతూ తమ బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ప్రయత్నం ద్వారా, విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ నైపుణ్యాలను అందించడంతో సహా సామాజిక, నైతిక విలువలు, ఆరోగ్యం మరియు పోషణ, యోగా, ధ్యానం ద్వారా శారీరక, మానసిక వికాసం వంటి అంశాలలో బోధన అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ బి సి ఎఫ్ టీం,జిడ్డు సూర్య వంశీ కంచం, యనపు యేసు, వాలంటీర్స్ నరేంద్ర సాయి, సాయి కిరణ్, పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పేకాట స్థావరంపై దాడి .. ఆరుగురు అరెస్ట్



భీమవరం, మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భీమవరం రెండో పట్టణంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ 1,01,600 నగదు, 6 మొబైల్ ఫోన్స్, 2 మోటార్ సైకిల్స్ ను స్వాదీనం చేసుకున్నట్లు భీమవరం టూ టౌన్ సిఐ కాళీ చరణ్ తెలిపారు. హెూటల్స్, లాడ్జిలలో విస్తృత తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, జేపీ రోడ్డులోని విసివ్ స్టే లాడ్జ్ లో తనిఖీలు నిర్వహిస్తున్న సందర్భంలో రూమ్ నెంబర్ 401లో పేకాట ఆడుతున్న 6 గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నామని అన్నారు. వారి వద్ద నుంచి నగదు, మొబైల్స్, మోటార్ సైకిల్స్ ను స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

# అభిమానులు సమాజ సేవలో భాగస్వాములు కావాలి

## అంగన్ వాడి కేంద్రంలోని చిన్నారులకు కంచాలు, గ్లాస్ లు, బిస్కెట్స్ పంపిణీ



భీమవరం, మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సినీ హీరోల అభిమానులు సమాజ సేవలో భాగస్వాములు కావాలని అఖిల భారత చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉండపల్లి రమేష్ నాయుడు అన్నారు. సినీనటులు మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు వేడుకలలో భాగంగా భీమవరం మెంటేవారి తోటలోని మున్సిపల్ పాఠశాల, అంగన్ వాడి కేంద్రంలోని చిన్నారులకు మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో కంచాలు, గ్లాసులు, చాపలు, బిస్కెట్లు అందించారు. రమేష్ నాయుడు మాట్లాడుతూ ప్రతి ఏడాది రామ్ చరణ్ పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతోనే నిర్వహిస్తున్నామని, మెగా అభిమానులు మరెన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. టౌన్ వైడ్ మెగా ఫాన్స అధ్యక్షుడు చల్లా రాము మాట్లాడుతూ 27న భీమవరంలో ధరణి బ్లాండ్ బ్యాంక్ లో ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, మెగా అభిమానులందరూ ఈ సేవా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మెగా అభిమానులు తోట శేషు, కొప్పర్తి కోటి, కోటిపల్లి చరణ్, నాగిడి శ్యామ్, యాతం స్వామి తదితరులు పాల్గొన్నారు.

# పాస్టర్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలి



భీమవరం, మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాజమండ్రిలోని కొంతమూరు - దివాన్ చెరువు మధ్యలో అనుమాన స్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై న్యాయ విచారణ జరిపించాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్, సీనియర్ దళిత నాయకులు కేసి రాజు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద దళిత ఐక్య వేదిక భీమవరం శాఖా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కార్యాలయ సూపరింటెండెంట్ కు వినతిపత్రాన్ని అందించారు. సుందర్ కుమార్, కేసి రాజు మాట్లాడుడ్తూ పాస్టర్ ప్రవీణ్ మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ధర్నాలో గొల్ల రాజ్ కుమార్, పట్టెం శుభకర్, ఆలమూరి బాబ్జి, అంబటి ఆనంద్ కుమార్, విపర్తి పుల్లయ్య దళిత యువకులు పాల్గొన్నారు.

# 108 గంటల పంచాంగ పుస్తకాలతో బాలత్రిపుర సుందరి దేవికి అలంకరణ

భీమవరం, మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఉగాది పండుగను పురస్కరించుకుని భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారికి 108 గంటల పంచాంగ పుస్తకాలతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో ఎపి రాష్ట్ర పురోహిత గౌరవాధ్యక్షులు యమిజాల లక్ష్మి నరసింహ మూర్తి ల అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 108 గంటల పంచాంగ పుస్తకాలతో పూజ చేసి భక్తులకు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, బాల త్రిపుర సుందరి మహిళ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# వాస్తు పండిట్ సుబ్రమణ్యంకు సీవీ రామన్ పురస్కారం



భీమవరం, మార్చి 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంకు చెందిన జ్యోతిష్య వాస్తు పండిట్ బ్రహ్మశ్రీ సన్నిధిరాజు జయప్రకాశ్ సుబ్రమణ్యం సీవీ రామన్ అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. సీవీ రామన్ అకాడమీ (సేవా, సాంస్కృతిక సంస్థ ) ప్రతి ఏడాది వివిధ రంగాలలో ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన వారికి పురస్కారాలు అందచేస్తుందని, ఇందులో భాగంగా ఈనెల 16న హైదరాబాద్ లో హరిహర కళాభవన్లో జరిగిన అవార్డ్ ల ప్రదానోత్సవంలో ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు సుబ్రమణ్యం తెలిపారు. గత 22 సంవత్సరాలుగా జ్యోతిష్య వాస్తు అంశాలలో విశేష సేవలందిస్తున్నానని, దీనిలో భాగంగానే సీవీ రామన్ అకాడమీ పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. అవార్డు అందుకున్న సుబ్రమణ్యంను పట్టణ పండితులు ప్రముఖులు అభినందించారు.

## ఐదేళ్ల విరామం తర్వాత

# చైనా నుంచి నేరుగా విమాన సర్వీసులు!

**చైనా : కొవిడ్, గల్వాన్ సంఘర్షణల నేపథ్యంలో గతంలో భారత్, చైనా విమాన సర్వీసులు నిలిపివేశారు. అయితే ఐదేళ్ల తర్వాత నేరుగా విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించాలని యోచిస్తున్నట్లు చైనా కాన్సుల్ జనరల్ జు వీ పేర్కొన్నారు. ఈ మేరకు భారత అధికారులతో చర్చలు జరుపుతున్నామన్నారు. కోల్‌కతాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. "కొవిడ్‌కు ముందు బీజింగ్, షాంఘై, గ్వాంగ్‌జౌ, కున్మింగ్ నుంచి భారత్‌లోని దిల్లీ, ముంబయి, కోల్‌కతా, ఇతర నగరాలకు వారానికి 50 విమాన సర్వీసులుండేవి. ఆ సేవలను తిరిగి పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నాం" అని ఆయన తెలిపారు.**



విమానాల పునరుద్ధరణ తర్వాత వీసా నిబంధనల్లో కూడా సడలింపులు చేసే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. భారత్, చైనా మధ్య దౌత్య సంబంధాలకు మరో వారంలో 75ఏళ్లు పూర్తవుతుండడంతో..ఈ సందర్భంగా ఏప్రిల్ 1న ఇరుదేశాలు సంయుక్తంగా కొన్ని వేడుకలను జరుపుకోనున్నట్లు జు వీ వెల్లడించారు. భారత్‌తో కలిసి ఈ వేడుకలను జరుపుకోవడానికి, దౌత్య సంబంధాలను మరింత మెరుగుపరుచుకోవడానికి తాము ఉత్సాహంగా ఎదురు చూస్తున్నామని అన్నారు.

జనవరిలో భారత్ విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ చైనాను సందర్శించిన తర్వాత భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ మొదట ఈ ప్రకటన విడుదల చేసింది. ఇరుదేశాల మధ్య విమాన సేవలను తిరిగి ప్రారంభించడానికి సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చినట్లు తెలిపింది. కొవిడ్ 19 మొదలైనప్పటి నుంచి ఇరు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అయితే, ఇటీవల లద్దాఖ్ సరిహద్దులో బలగాల ఉపసంహారణ, గస్తీ పునఃప్రారంభం విషయంలో రెండు దేశాలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో నేరుగా విమాన సర్వీసుల అంశం చర్చకు వచ్చినట్లు పేర్కొంది.

# భారత నిఘా సంస్థ 'రా'పై అమెరికా ఆంక్షలు..?

**అమెరికా : భారత్‌కు చెందిన నిఘా సంస్థ రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా) పై అమెరికా ఆంక్షల కత్తి వేలాడుతోంది. ఇటీవల 'ది యూఎస్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలిజియస్ ఫ్రీడమ్' సంస్థ 'రా'పై ఆంక్షలు విధించాలని అక్కడి ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. సిక్కు వేర్పాటువాదుల హత్యకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు రావడమే దీనికి కారణమని ఆంగ్ల వార్తా సంస్థ కథనంలో పేర్కొంది. ఈ కమిషన్ వార్షిక నివేదికను మంగళవారం విడుదల చేసింది. దీనిలో భారత్‌పై మరిన్ని ఆరోపణలు చేసింది. మైనార్టీలు దారుణ పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. మత స్వేచ్ఛ విషయంలో ఆందోళనకర దేశంగా భారత్‌ను ప్రకటించాలని సూచించింది. 2024లో కూడా భారత్‌లో మతపరమైన మైనార్టీలపై వేధింపులు, దాడులు పెరుగుతున్నాయని అభిప్రాయపడింది.**




ఈ నివేదికపై భారత్ తక్షణమే స్పందించలేదు. అయితే.. ఈ సంస్థ ఇచ్చిన నివేదికను, సూచనలను ట్రంప్ కార్యవర్గం తప్పనిసరిగా పాటించాలన్న నిబంధన లేదు. వియత్నాంలోని కమ్యూనిస్ట్ పాలకులను కూడా ఈ కమిషన్ నివేదిక లక్ష్యంగా చేసుకొంది. మత వ్యవహారాలను ఆ దేశం నియంత్రిస్తోందని పేర్కొంది. ఆ దేశాన్ని ఆందోళనకర జాబితాలో చేర్చాలని పేర్కొంది.

చైనాను కట్టడి చేసే క్రమంలో అమెరికా పాలకులు భారత్, వియత్నాంతో కలిసి పనిచేస్తున్న సంగతి తెలిసిందే. బీజింగ్‌ను కట్టడి చేయడానికి న్యూదిల్లీ బలమైన శక్తి అని అమెరికా కొన్నేళ్లుగా భావిస్తోంది. ఈనేపథ్యంలో ట్రంప్ కార్యవర్గం భారత నిఘా సంస్థ 'రా'పై ఎటువంటి చర్యలు చేపట్టకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

2023లో అమెరికా, కెనడాలో సిక్కు వేర్పాటువాదులను భారత్ లక్ష్యంగా చేసుకొంటోందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈక్రమంలో మాజీ ఇంటెలిజెన్స్ అధికారి వికాస్ యాదవ్‌పై అమెరికా ఆరోపణలు మోపింది. ఖలిస్థానీ నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర పన్నినట్లు దానిలో పేర్కొంది. మరోవైపు అమెరికాలో ఉంటూనే పన్నూ భారత ప్రభుత్వానికి బెదిరింపు సందేశాలను విడుదల చేస్తుండటం విశేషం. సీఆర్పీఎఫ్ స్కూళ్లను, ఎయిర్ ఇండియా విమానాలను, కుంభమేళాను లక్ష్యంగా చేసుకోవాలని ఖలిస్థానీలకు అతడు పలుమార్లు పిలుపునిచ్చాడు.

# కాల్పుల విరమణపై పుతిన్ సాగదీత.. ట్రంప్

**రష్యా : ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో రష్యా వైఖరిపై సానుకూలంగా వ్యవహరిస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. కీవ్‌తో కాల్పుల విరమణ అంశాన్ని రష్యా అధ్యక్షుడు పుతిన్ కావాలనే సాగదీస్తున్నారని అన్నారు. వాషింగ్టన్ మధ్యవర్తిత్వాన్ని మాస్కో తారుమారు చేస్తోందని ఆరోపించారు.**



ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ దీని గురించి మాట్లాడారు. "యుద్ధానికి ముగింపు పలకాలని రష్యా కోరుకుంటోందని నేను అనుకుంటున్నా. కానీ, ఇప్పుడు వారి కాళ్లను వారే లాక్కుంటున్నారని అనిపిస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా మధ్యవర్తిత్వం చేస్తున్నప్పటికీ పుతిన్ ఉద్దేశపూర్వకంగా దాన్ని అడ్డుకుంటున్నట్లు కన్పిస్తోంది. ఏదేమైనప్పటికీ ఈ మారణహోమాన్ని నేను ఆపాలనుకుంటున్నా. కీవ్‌కు అందిస్తున్న ఆర్థిక సాయానికి ముగింపు పలకాలనుకుంటున్నా" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

30 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ పాటించాలంటూ అమెరికా చేసిన ప్రతిపాదనకు ఇప్పటికే ఉక్రెయిన్ అంగీకరించిన సంగతి తెలిసిందే. దీనిపై మాస్కోను ఒప్పించేందుకు అగ్రరాజ్యం చర్చలు ప్రారంభించింది. సౌదీ వేదికగా రష్యాతో అమెరికా అధికారులు మంతనాలు చేస్తున్నారు. ఇందులోభాగంగానే నల్ల సముద్రంలో దాడులను నిలిపివేసేందుకు ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరినట్లు శ్వేతసౌధం మంగళవారం ప్రకటించింది. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటలకే ట్రంప్.. పుతిన్‌పై ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇటీవల పుతిన్‌తో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడిన అనంతరం.. కాల్పుల విరమణ ఒప్పందానికి మాస్కో కూడా సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. అయితే, రష్యాపై పశ్చిమదేశాల ఆంక్షలు ఎత్తివేస్తేనే కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలుచేస్తామని పుతిన్ షరతు పెట్టినట్లు తెలుస్తోంది. అంతేగాక.. జపోరిజియా అణు విద్యుత్ ప్లాంట్‌ను ఉక్రెయిన్‌కు తిరిగిచ్చేందుకు కూడా రష్యా నిరాకరిస్తున్నట్లు సమాచారం.

# మస్క్‌పై జేడీ వాన్స్ విమర్శలు..?



**అమెరికా : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో జేడీవాన్స్ ఉపాధ్యక్షుడిగా, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ 'డోజ్' సారథిగా కొనసాగుతున్నారు. అధికారిక కార్యక్రమాల్లో ట్రంప్ వెంటే కనిపించే వీరిద్దరికీ పొసగడం లేదా..?మస్క్‌ను వాన్స్ విమర్శించారా..? ఈ వార్తల్లో నిజమెంత..?**

ఎలాన్ మస్క్‌ను అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ విమర్శిస్తున్న ఆడియో క్లిప్ ఒకటి ఎక్స్‌లో వైరల్‌గా మారింది. మస్క్ అమెరికన్ కాదు.. దక్షిణాఫ్రికాకు చెందిన వ్యక్తి అని వాన్స్ పేర్కొనట్లు అందులో వినిపిస్తోంది. అలాగే కుబేరుడి చర్యలు ట్రంప్ పాలనకు ఉపకరించడం లేదని, ఆయన ఎన్నికైన అధికారిలా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించినట్టుగా ఉంది. ఈ క్లిప్‌ను ఓ యాక్టివిస్ట్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసి.."అంతర్గత పోరు తీవ్రస్థాయిలో ఉంది" అని వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారం జేడీ వాన్స్ దృష్టికి చేరడంతో ఆయన స్పందించారు. "అది ఏఐతో సృష్టించిన నకిలీ వీడియో. ఈ వ్యక్తికి వాస్తవాన్ని గుర్తించే తెలివితేటలు లేకపోవడం నాకేమీ ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు. ఇప్పుడు అది నకిలీదని తెలిసిన తర్వాతైనా దానిని తొలగిస్తారా..? అలా చేయకపోతే, అది పరువునష్టం కిందికే వస్తుంది" అని పోస్టు పెట్టారు.

# భూగర్భ క్షిపణి నగరం నిర్మించిన ఇరాన్..!



**ఇరాన్ : ఇరాన్ తన ఆయుధ సామర్థ్యాన్ని తెలియజేస్తూ ఓ వీడియోను విడుదల చేసింది. దాదాపు 85 సెకన్ల నిడివిగల ఈ క్లిప్‌లో అత్యాధునిక క్షిపణులను ప్రదర్శించింది. ఇరాన్‌కు చెందిన సాయుధ బలగాల అధిపతి హొస్సేనీ బఘేరీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ఏరోస్పేస్ కమాండర్ అమీర్ అలీ హాజిజాద్ ఓ వాహనంపై సొరంగ మార్గంలో ప్రయాణిస్తూ ఆయుధాలను వీక్షించిన దృశ్యాలున్నాయి. ఈ వీడియోలో ఖైబర్ షెకాన్స్, ఘద్రహస్, సెజ్జిల్స్, హజ్ ఖాసీమ్స్, పవేహ్ ల్యాండ్ అటాక్ క్షిపణులు ఉన్నాయి.**

ఈ వీడియోను ఇరాన్ పర్వత ప్రాంతాల్లో చిత్రీకరించారు. దీనిలో అత్యంత పొడవైన సొరంగాలు, గుహలు కనిపిస్తున్నాయి. ఒకవేళ ఏమైనా భద్రతా పరమైన ఉల్లంఘనలు జరిగితే తీవ్ర పరిణామాలను చవిచూడాల్సిన పరిస్థితి ఇక్కడ ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇరాన్ అణుఒప్పందం కుదుర్చుకోవడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండు నెలల గడువు విధించిన నేపథ్యంలో ఈ వీడియో బయటకు రావడం విశేషం. ఒబామా ప్రభుత్వంతో కుదుర్చుకొన్న ఒప్పందం నుంచి 2018లో బయటకు వచ్చేసిన విషయం తెలిసిందే. మరోవైపు అమెరికాతో పరోక్షంగా చర్చలకు తాము సిద్ధమేనని సంకేతాలు ఇచ్చింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘీ మాట్లాడుతూ పరోక్ష చర్చలకు మార్గం తెరిచే ఉందని వ్యాఖ్యానించారు. అదే సమయంలో ఇరాన్ విషయంలో ప్రత్యర్థుల వైఖరిలో మార్పు రానంతవరకు ప్రత్యక్ష చర్చలకు అవకాశం లేదని తేల్చి చెప్పారు. ఇటీవల యెమెన్‌లోని హూతీలపై అమెరికా భీకర స్థాయిలో విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే.

# భారత్-కెనడా సంబంధాల పునరుద్ధరణకు యత్నాలు మొదలు..!



**కెనడా : రెండేళ్లుగా పతనమవుతూ వస్తున్న భారత్-కెనడా సంబంధాలకు మరమ్మతులు చేసేందుకు ఇరుదేశాలు యత్నిస్తున్నాయి. గతేడాది ఉపసంహరించుకొన్న దౌత్యవేత్తలను తిరిగి పంపేందుకు యత్నాలు మొదలుపెట్టినట్లు బ్లూమ్‌బెర్గ్ పత్రిక కథనం వెలువరించింది. దీనిలోభాగంగానే ఇటీవల భారత్ నిర్వహించిన ఇంటెలిజెన్స్ కాంక్లేవ్‌కు కెనడా నిఘా విభాగాధిపతి డేనియల్ రోజర్స్ హాజరయ్యారని తెలుస్తోంది. ఈ సదస్సును జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ ఆధ్వర్యంలో న్యూదిల్లీలో నిర్వహించారు.**

ఈక్రమంలో కెనడాలోని అల్బెర్టాలో జరగనున్న జీ-7 సదస్సు సందర్భంగా భారత ప్రధాని మోదీ, కెనడా నూతన ప్రధానితో భేటీ అయ్యే అవకాశాలున్నాయి. ఈ గ్రూపు సదస్సుకు భారత్ అబ్జర్వర్ హోదాలో హాజరుకానుంది.

ఇక కెనడాలో మార్క్ కార్నీ అధికారం చేపట్టిన తర్వాత భారత్‌తో సంబంధాల పునరుద్ధరణపై దృష్టిపెట్టారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరుదేశాలను లక్ష్యంగా చేసుకోవడంతో ఆ ప్రభావాన్ని తగ్గించేందుకు ఈ వ్యూహం ఎంచుకొంది. మార్చి 4వ తేదీన కెనడా ప్రధానిగా గెలవడానికి ముందు కార్నీ మాట్లాడుతూ "ఏకరూప ఆలోచనా విధానం కలిగిన దేశాలతో కెనడా వాణిజ్య భాగస్వామ్యాలను విస్తరించాలని భావిస్తోంది. అదే సమయంలో భారత్‌తో సంబంధాన్ని పునరుద్ధరించేందుకు చాలా అవకాశాలున్నాయి" అని వ్యాఖ్యానించారు. ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య వెనక న్యూదిల్లీ హస్తం ఉందని 2023 సెప్టెంబర్‌లో కెనడా ప్రధాని ట్రూడో తీవ్ర ఆరోపణలు చేయడంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మొదలయ్యాయి. కాగా, భారత్ మాత్రం ఈ ఆరోపణలను కొట్టిపారేసింది. ఇక తాజాగా కెనడా ఎన్నికల్లో న్యూదిల్లీ జోక్యం చేసుకోనుందని ఆ దేశ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్ వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదమైంది. పరోక్షంగా కొందరు ఏజెంట్ల ద్వారా భారత్ ఆర్థికసాయం పంపిస్తోందంటూ పేర్కొన్న విషయం తెలిసిందే.

# ఆ విషయంలో ద్రవిడ్‌ను గంభీర్ ఫాలో అవుతాడా?

## ఇంకా ఆ ప్రకటన రాలేదు: గావస్కర్




ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ని టీమ్‌ఇండియా కైవసం చేసుకొన్న సంగతి తెలిసిందే. తుది పోరులో న్యూజిలాండ్ ఓడించి విజేతగా నిలిచింది. దీంతో ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టుకు బీసీసీఐ రూ.58 కోట్లను నజరానా ప్రకటించింది. ఈ లెక్కన ఆటగాళ్లతోపాటు ప్రధాన కోచ్‌కు రూ.3 కోట్ల చొప్పున అందనుంది. సహాయక కోచింగ్ సిబ్బందికి రూ.50 లక్షల చొప్పున.. సపోర్ట్ సిబ్బందికి రూ.25 లక్షలు దక్కనుంది. మరి గత ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్‌లా గంభీర్ కూడా తన ప్రైజ్‌మనీని వెనక్కి ఇస్తాడా? లేదా? అనేది తెలియరాలేదు. ఇప్పటికైతే అతడి నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఇదే అంశంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ఓ ఇంటర్వ్యూలో స్పందించాడు.

"గతేడాది టీ20 ప్రపంచకప్‌ను గెలిచిన తర్వాత భారత జట్టుకు బీసీసీఐ ప్రైజ్‌మనీని ప్రకటించింది. అప్పుడు కోచ్‌గా ఉన్న రాహుల్ ద్రవిడ్‌కు ఇతర సిబ్బందితో పోలిస్తే భారీగా నజరానా అందింది. కానీ ద్రవిడ్ మాత్రం అందుకు తిరస్కరించి ఆ మొత్తాన్ని వెనక్కి ఇచ్చేశాడు. తన సహచరులకు సమంగా పంచేలా చేశాడు. ఇప్పుడు కూడా బీసీసీఐ ఛాంపియన్స్ ట్రోఫీ విజేత టీమ్‌ఇండియాకు రివార్డును ప్రకటించింది. మరి ప్రస్తుత కోచ్ నుంచి మాత్రం ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ద్రవిడ్‌లా అతడూ చేస్తాడా? లేదా? లేకపోతే ఆ రోల్‌మోడల్ సరైంది కాదని అనుకుంటున్నారా?" అని గావస్కర్ వ్యాఖ్యానించాడు.

**బీసీసీఐ మంచి నిర్ణయం..**

"బీసీసీఐ నిర్ణయం బాగుంది. మన కుర్రాళ్లు సాధించిన దానికి సరైన నజరానా ప్రకటించడం అభినందనీయం. గత టీ20 ప్రపంచకప్ తర్వాత ఏకంగా రూ.125 కోట్లు అందించింది. ఇది నిజంగా అద్భుతం. నిధులతో నిండి ఉన్న బోర్డు ప్రతిఒక్కరూ చేసిన కృషికి కృతజ్ఞతలు తెలియజేస్తూ వారికి బహుమతులు అందిస్తోంది. అలాగే విజేతల కోసం ఐసీసీ ప్రకటించిన బహుమతి డబ్బును కూడా ఆటగాళ్లు తమవద్ద ఉంచుకోవడానికి బీసీసీఐ అనుమతిస్తోంది, దీంతో ప్రతిఒక్కరికీ మంచి మొత్తం లభిస్తోంది" అని గావస్కర్ అభినందించాడు.

# 'గేల్ మార్క్'... ఐపీఎల్‌లో ఈ రికార్డు బద్దలవుతుందా?



ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు గురించి, అది బ్రేక్ చేసే అవకాశం సమీప భవిష్యత్తులో లేదు అంటూ మనం చదువుకున్నాం. ఐపీఎల్ చరిత్రలో బద్దలవ్వడానికి అవకాశం తక్కువగా ఉన్న రెండో రికార్డు ఇప్పుడు చూద్దాం. ఇది యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ (Chris Gayle) గురించి. 12 ఏళ్ల క్రితం అతను నెలకొల్పిన రికార్డు ఇంకా అలానే ఉంది. చూస్తుంటే ఆ రికార్డు బద్ధలవ్వడం అంత ఈజీ కాదనిపిస్తోంది.

2013లో పుణె వారియర్స్‌పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున క్రిస్ గేల్ (175లి) తుపాను ఇన్నింగ్స్ ఆడాడు. 265.15 స్ట్రయిక్ రేట్‌తో 13 ఫోర్లు, 17 సిక్సర్లు బాది భారీ సెంచరీ నమోదు చేశాడు. ఇది జరిగి 12 ఏళ్లు అవుతోంది. అప్పటి నుంచి సీజన్లు వస్తున్నాయ్, పోతున్నాయ్ కానీ ఈ రికార్డు అలానే ఉంది. అలా అని వేగంగా ఆడే బ్యాటర్లు, భారీ సిక్స్‌లు కోట్టేవాళ్లు లేరా అంటే ప్రతి జట్టులో పుష్కలంగా ఉన్నారు. కానీ గేల్ రికార్డు అలానే ఉంది.

**ఈసారి ఛాన్స్ ఉందా?**

ఐపీఎల్‌లో బ్యాటింగ్ మారింది. వికెట్లూ మారాయి. బ్యాటర్ల ఇన్నోవేటివ్ షాట్లు కూడా పెరిగాయి. అయితే వికెట్ల దగ్గర పాతుకుపోవడం తగ్గిపోయింది. వచ్చామా.. భారీ షాట్లు ఆడామా.. వెళ్లామా.. వేరొకరు వచ్చి వేగంగా ఆడారా అనే పరిస్థితి కనిపిస్తోంది. మరి ఈ ఏడాదైనా బ్యాటర్లు గేల్ మార్క్‌ను దాటుతారా? కొత్త రికార్డు సృష్టిస్తారా అనేది చూడాలి. ఇక ఎవరికి ఆ అవకాశం ఉందా అని చూస్తే.. ఎక్కువగా ఓపెనర్లకే ఆ ఛాన్స్ ఉంటుంది. అది కూడా ఆఖరి ఓవర్ వరకు క్రీజులో ఉంటేనే. అలా ఎవరా అని చూస్తే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, యశస్వి జైస్వాల్, సంజు శాంసన్, సునీల్ నరైన్, ఫిల్ సాల్ట్ పేర్లు కనిపిస్తాయి. అయితే సంచలనాలకు మారుపేరైన ఐపీఎల్‌లో వీళ్లెవరూ కాకుండా కొత్త కుర్రాళ్లు వచ్చి రికార్డు బద్ధలుకొట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

# శ్రేయస్ సెంచరీ మిస్..

## రవిశాస్త్రి వ్యాఖ్యలు కోహ్లీని ఉద్దేశించేనా?




**ఐపీఎల్ 2025 సీజన్‌లో గుజరాత్‌తో మ్యాచ్‌లో పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (97లి) సెంచరీ మిస్ అయింది. చివరి మూడు ఓవర్లలో కేవలం నాలుగు బంతులను మాత్రమే ఆడాడు. మరోవైపు శశాంక్ సింగ్ సిక్స్‌లు, ఫోర్లతో విరుచుకుపడ్డాడు. దీంతో తనకు స్ట్రైకింగ్ రాకపోయినా ఫర్వాలేదు వేగంగా ఆడాలని శ్రేయస్ చెప్పినట్లు మ్యాచ్ అనంతరం శశాంక్ వెల్లడించాడు. రవిశాస్త్రి అడిగిన ప్రశ్నకు శశాంక్ సమాధానం ఇచ్చాడు. ఈ సందర్భంగా మాజీ ప్రధాన కోచ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. విరాట్ కోహ్లీని గుర్తు చేస్తున్నాయని నెట్టింట కామెంట్లు వస్తున్నాయి. రవిశాస్త్రి - శశాంక్‌ల మధ్య సంభాషణ ఇలా..**

"నిజాయతీగా చెప్పాలంటే నేనాడిన తొలి బంతి నుంచి శ్రేయస్ నాకు ఒకటే మాట చెప్పాడు. 'శశాంక్, నువ్వు నా సెంచరీ గురించి ఆలోచించొద్దు. నీ తరహాలో షాట్లు కొట్టేసి ఇన్నింగ్స్‌ను ఫినిష్ చెయ్' అన్నాడు. అతడు అలా చెప్పడంతో వేగంగా ఆడేందుకు ప్రయత్నించా" అని శశాంక్ తెలిపాడు. అందుకు స్పందించిన రవిశాస్త్రి "అది సరైన నిర్ణయం. టీమ్ గేమ్‌లో ఇలానే ఉండాలి. వ్యక్తిగత మైలురాళ్ల కోసం ఆడకూడదు" అని వ్యాఖ్యానించాడు. ఇవే ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీశాయి.

**అప్పుడు కోహ్లీ అలా..**

2019 ఐపీఎల్‌లో కోల్‌కతాతో జరిగిన మ్యాచ్ సందర్భంగా ఆర్సీబీ ఆటగాడు విరాట్ కోహ్లీ చివర్లో రెండో పరుగు కోసం ప్రయత్నించలేదు. స్ట్రైకింగ్ చేసిన మార్కస్ స్టాయినిస్ బంతిని కొట్టగా.. సింగిల్ మాత్రమే చాలని కోహ్లీ ఆపేశాడు. అప్పుడు మరొక్క బంతి మాత్రమే ఉంది. అప్పటికి కోహ్లీ 96 పరుగుల మీదున్నాడు. దీంతో తన సెంచరీ కోసమే రెండో పరుగు తీయలేదు. ఆఖరికి బౌండరీతో కోహ్లీ శతకం పూర్తి చేశాడు. అలాగే గత వన్డే ప్రపంచకప్‌లోనూ బంగ్లాదేశ్‌పై సెంచరీకే ప్రాధాన్యం ఇచ్చాడని అప్పట్లో వ్యాఖ్యలు వినిపించాయి. ఇప్పుడు శ్రేయస్ తన తొలి సెంచరీని త్యాగం చేశాడని.. కోహ్లీని ఉదహరిస్తూ సోషల్ మీడియాలో చర్చ మొదలైంది.

# అయ్యర్ ఇప్పుడు

## అన్ని ఫార్మాట్ల ఆటగాడు: గంగూలీ




**బీసీసీఐ ఆగ్రహానికి గురై జట్టుకు కొన్నాళ్లు దూరమైన శ్రేయస్ అయ్యర్ ఆటతీరు గతేడాది అద్భుతంగా మెరుగుపడిందని గంగూలీ పొగడ్తల్లో ముంచెత్తాడు. నిన్న గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అయ్యర్ అద్భుతంగా ఆడి 97 పరుగులు సాధించి.. పంజాబ్ జట్టును విజయ పథంలో నడిపించాడు. ఈ నేపథ్యంలో టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ ఎక్స్ వేదికగా స్పందించాడు. "గత ఏడాది కాలంలో అద్భుతంగా ఆటను మెరుగుపర్చుకొన్న ఆటగాడు శ్రేయస్ అయ్యర్. అతడు అన్ని ఫార్మాట్లకు సిద్ధంగా ఉన్నాడు. కొన్ని ఇషువ్యల తర్వాత అతడు ఆటను మెరుగుపర్చుకొన్న తీరు చాలా గొప్పగా ఉంది" అని పేర్కొన్నాడు.**

**వచ్చే మ్యాచ్‌లో శతకం చేస్తాను : అయ్యర్**

గుజరాత్‌తో మ్యాచ్ సందర్భంగా అయ్యర్ శతకాన్ని త్రుటిలో కోల్పోయాడు. 97 పరుగుల వద్ద నాటౌట్‌గా నిలిచాడు. దీనిపై అతడు మ్యాచ్ అనంతరం స్పందిస్తూ.. వచ్చే మ్యాచ్‌లో శతకం సాధిస్తానని ఆత్మవిశ్వాసంగా చెప్పారు. "గుజరాత్ టైటాన్స్ ఎదుట భారీ స్కోర్ ఉంచాలనే లక్ష్యంతో ఆడాము. ఎందుకంటే జీటీ బ్యాటింగ్ లైనప్ చాలా బలంగా ఉంది. ఐపీఎల్‌లో చివరి వరకు ఏమైనా జరగొచ్చు. శశాంక్ సింగ్‌ను నేనే భారీ షాట్స్ ఆడమని చెప్పాను. నా శతకం గురించి పట్టించుకోలేదు. దానిని వచ్చే మ్యాచ్‌లో సాధిస్తాను" అని అయ్యర్ వెల్లడించాడు.


ఇక శశాంక్ దూకుడును కూడా అయ్యర్ అభినందించాడు. "గతేడాది నీ బ్యాటింగ్ శైలిని చూసి నేను స్ఫూర్తి పొందాను. నిజం చెప్పాలంటే.. అది నాకు గట్టి ఆత్మవిశ్వాసం ఇచ్చింది. నువ్వు మైదానంలోకి వచ్చీరాగానే.. మూడో బంతి నుంచే విరుచుకుపడిన తీరు.. నువ్వు సాధించిన 44 పరుగులు చాలా ప్రభావవంతమైనవి. భవిష్యత్తులో కూడా ఇదే ఆటతీరును కొనసాగిస్తావని ఆశిస్తున్నా" అని శశాంక్‌తో అన్నాడు. 2023 డిసెంబర్‌లో అయ్యర్ చివరి సారి అంతర్జాతీయ టీ20 ఆడాడు. ఆ మ్యాచ్‌లో అర్ధశతకం బాదాడు. ఆ తర్వాత పొట్టి ప్రపంచకప్ నుంచి దూరమయ్యాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు నాయకత్వం వహించాడు. ఆ తర్వాత అది కూడా రిటైన్ చేసుకోలేదు. కానీ, పంజాబ్ జట్టు ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర రూ.26.75 కోట్లు చెల్లించి అతడిని కొనుగోలు చేసింది.

# అతడికి ఎందుకు అవకాశం ఇవ్వలేదు? ఫ్యాన్ డిబేట్‌లోకి సుందర్ పిచాయ్ ఎంట్రీ!

ఐపీఎల్ 2025 సీజన్‌ను గుజరాత్ టైటాన్స్ ఓటమితో మొదలెట్టింది. పంజాబ్ చేతిలో 11 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో బరిలోకి దిగిన గుజరాత్ ఫైనల్ %ఠ×%లో ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు చోటు దక్కలేదు. ఆల్‌రౌండర్‌ను ఆడించకపోవడంపై సోషల్ మీడియా వేదికగా కామెంట్లు వస్తున్నాయి. ఈ చర్చలో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ భాగస్వామి కావడం గమనార్హం. ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచిన జట్టులో అతడు సభ్యుడని ఫ్యాన్స్ గుర్తు చేశారు. "భారత్‌లోని అత్యుత్తమ 15 మంది ఆటగాళ్ల జాబితాలో వాషింగ్టన్ సుందర్ ఎలా చోటు దక్కించుకున్నాడో కానీ.. పది టీమ్‌లు ఉన్న ఐపీఎల్‌లో ఫైనల్ %ఠ×%లో మాత్రం అవకాశం దొరకకపోవడం మిస్టరీగా ఉంది" అని ఓ అభిమాని పోస్టు పెట్టాడు. దీనికి గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ స్పందిస్తూ.. "నాకూ ఇదే ఆశ్చర్యంగా అనిపిస్తోంది" అని రిప్లయ్ ఇచ్చారు. వాషింగ్టన్ సుందర్ స్పిన్ ఆల్‌రౌండర్. టీ20 ఫార్మాట్‌లో స్పిన్ కీలకపాత్ర పోషిస్తుంది. పరుగులు ఇచ్చినా వికెట్లు కూడా దక్కుతాయి. సుందర్ నమ్మదగ్గ బ్యాటర్ కూడానూ. లోయర్ విలువైన పరుగులు చేయగల సత్తా ఉన్న ప్లేయర్. ఒకవేళ సుందర్ జట్టులో ఉండి ఉంటే.. లక్ష్య ఛేదనలో గుజరాత్ పరిస్థితి భిన్నంగా ఉండే అవకాశం లేకపోలేదు.



CINIMA NEWS
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక



## అందంతో కట్టిపడేస్తున్న నభా నటేష్ !

## పవన్ కల్యాణ్ గురువు, మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడు హుసైని కన్నుమూత

చెన్నై %-% ప్రముఖ కోలీవుడ్ నటుడు షిహాన్ హుసైని (60) అనారోగ్యంతో కన్నుమూశారు. కొద్దిరోజులుగా ఆయన బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ చెన్నైలోని ఓ ఆసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హుసైని మరణ వార్తపై సినీ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ సంతాపం తెలియజేస్తున్నారు.

ఆయన 1986లో విడుదలైన ‘పున్నగై మన్నన్’ అనే చిత్రం ద్వారా కోలీవుడ్ సినీ పరిశ్రమకు పరిచయమయ్యారు. ఆ తర్వాత అనేక చిత్రాల్లో నటించినప్పటికీ, విజయ్ ప్రధాన పాత్రలో నటించిన ‘బద్రి’ సినిమా ద్వారా ఆయనకు విశేష గుర్తింపు లభించింది. హుసైని ఆర్చరీ శిక్షకుడిగా కూడా పేరొందారు. ఈ క్రమంలో 400 మందికి పైగా విద్యార్థులకు ప్రొఫెషనల్ శిక్షణ అందించారు.

కాగా, హీరో పవన్ కల్యాణ్‌కు హుసైని మార్షల్ ఆర్ట్స్, కరాటే, కిక్ బాక్సింగ్ వంటి యోధ కళల్లో శిక్షణ అందించారు. ఆయన దగ్గర శిక్షణ తీసుకుంటూనే పవన్ బ్లాక్ బెల్ట్ సాధించారు.



## ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విలన్ గ్యాంగ్

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విలన్ గ్యాంగ్ సినిమాలు చూసినప్పుడు కొన్ని సన్నివేశాలు మన మనసులో నిలిచిపోతాయి. హీరోయిజం మెరిసిన సీన్స్, హీరోయిన్ల గ్లామర్ షాట్స్, లేదా కడుపుబ్బా నవ్వించిన కామెడీ మిగిలిపోతాయి. ఒకప్పుడు తెలుగు సినిమా విలన్లు తమ భయానకమైన మేనరిజంతో ప్రేక్షకులపై చెరగని ముద్ర వేశేవారు. కానీ ఇటీవల స్టైలిష్ గా భయపెట్టే విలనిజం పెద్దగా కనిపించడంలేదు.అయితే, ‘ఆఫీసర్ ఆన్ డ్యూటీ’ సినిమా చూసినవాళ్లంతా ఒకటే విషయం చెబుతున్నారుఈ సినిమాలోని విలన్ గ్యాంగ్ భయంకరంగా ఉంది! కథలో ఓ యువకుడు పోలీస్ విచారణలో చనిపోతాడు. అతను ఒక డ్రగ్స్ మాఫియా సభ్యుడు. ఆ గ్యాంగ్ దీనికి ప్రతీకారంగా ఆ పోలీస్ ఆఫీసర్‌ను టార్గెట్ చేస్తుంది. పోలీసులు వారిని వేటాడుతుంటే, ఆ గ్యాంగ్ కూడా పోలీసును ఫాలో అవుతూ, కఠినమైన ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తుంది.ఈ నేపథ్యంలో వచ్చే దృశ్యాలు ప్రేక్షకులను కుర్రసించేలా ఉంటాయి. మాదక ద్రవ్యాలు, విచ్చలవిడితనం, అంతకు మించి అత్యుత్సాహంతో పగ తీర్చుకునే ప్రయత్నాలుఇవి ఈ సినిమాలో విలన్ గ్యాంగ్ రచ్చ మామూలుగా లేదనిపిస్తుంది. ముఖ్యంగా ఈ గ్యాంగ్‌ను పోషించిన నటుల పెర్ఫార్మెన్స్ అసాధారణంగా ఉంది. వారు నటిస్తున్నారా, నిజంగానే ఆ పాత్రలుగా మారిపోయారా అన్న అనుమానం కలుగుతుంది.ముగ్గురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు కలిసిన ఈ విలన్ గ్యాంగ్ యాక్టింగ్ హైలైట్‌గా నిలుస్తుంది. ఈ సినిమా చూసినవాళ్లు ఈ గ్యాంగ్ గురించి మాట్లాడుకోకుండా ఉండలేరు. ఒకటికి రెండుసార్లు ఈ సినిమా చూడాలనిపించేంత ఆసక్తిని పుట్టించగలిగారు. ఈ మధ్య కాలంలో తెలుగు ప్రేక్షకులను కుదిపేసిన బెస్ట్ విలన్ గ్యాంగ్ ఇదేనని నిశ్చయంగా చెప్పొచ్చు.ప్రస్తుతం ‘ఆఫీసర్ ఆన్ డ్యూటీ’ మూవీ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. మిస్సవ్వకండి!



### ది ప్యారడైజ్’ పోస్టర్ విడుదల

## అదిరిపోయే లుక్

### 365 రోజులు కౌంట్‌డౌన్ స్టార్ట్

‘దసరా’ సినిమాతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసిన నాని, మరో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో రాబోతున్నాడు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా పేరు ‘ది ప్యారడైజ్’. ఇప్పటికే విడుదలైన అప్‌డేట్‌లతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా సినిమా విడుదలకు ఏడాది సమయం మాత్రమే మిగిలి ఉండటంతో నాని కొత్త పోస్టర్‌ను తన ‘ఎక్స్’ (ట్విట్టర్) ఖాతాలో షేర్ చేశాడు. “365 రోజులు” అంటూ విడుదలైన ఈ పోస్టర్‌లో నాని రగ్డ్ లుక్‌లో, గన్ పట్టుకుని అదిరిపోయాడు. మాస్ లుక్‌లో నాని కనువిందు చేస్తుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఇప్పటికే విడుదలైన ‘రా స్టేట్‌మెంట్’ వీడియోలో నాని లుక్, డైలాగ్స్ మాస్ ఫ్యాన్స్‌కు బాగా నచ్చాయి. వచ్చే ఏడాది మార్చి 26న ఈ సినిమా విడుదల కానుంది. పాన్ ఇండియా లెవెల్‌లో రిలీజ్ అవుతున్న ఈ సినిమా యాక్షన్ ఫ్యాన్స్‌కి పక్కా ట్రీట్ కానుంది.

**పోస్టర్‌లో నాని రగ్డ్ లుక్!**

ఈ పోస్టర్‌లో నాని మాస్ లుక్‌లో అదిరిపోయాడు. చొక్కాలేకుండా, గన్ పట్టుకుని చాలా పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నాడు. గతంలో ‘దసరా’లో మట్టి ముద్దలతో రా లుక్‌లో మెప్పించిన నాని, ఈసారి డబుల్ ఇంటెన్సిటీ చూపించబోతున్నట్లు తెలుస్తోంది. మేకర్స్ నుంచి అధికారికంగా వెల్లడించనప్పటికీ, ఇది టెర్రిఫిక్ యాక్షన్ మూవీగా ఉండబోతుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**‘రా స్టేట్‌మెంట్’ వీడియోకు మాస్ రెస్పాన్స్!**

కొద్ది రోజుల క్రితం మూవీ యూనిట్ ‘రా స్టేట్‌మెంట్’ పేరుతో ఓ వీడియో విడుదల చేసింది. ఈ వీడియోలో నాని లుక్, డైలాగ్స్ ఊర మాస్‌గా ఉండటంతో అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. ముఖ్యంగా రెండు జడలతో, రగ్డ్ లుక్‌లో కనిపించిన నాని, మరోసారి పక్కా మాస్ క్యారెక్టర్ ప్లే చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార చిత్రాలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




**ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ‘ది ప్యారడైజ్’**

ఇప్పటి వరకు లభించిన సమాచారం ప్రకారం, ‘ది ప్యారడైజ్’ పూర్తిగా యాక్షన్ అండ్ మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. అంతేకాదు, ఈ సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు టాక్. అయితే, దీనిపై అధికారిక సమాచారం మాత్రం ఇంకా బయటకు రాలేదు.




**పాన్ ఇండియా స్థాయిలో విడుదల**

ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ భాషల్లో మాత్రమే కాకుండా ఇంగ్లిష్, స్పానిష్ వంటి విదేశీ భాషల్లోనూ ఒకేసారి విడుదల కానుంది. ఈ విధంగా, ఇది గ్లోబల్ మార్కెట్‌ని టార్గెట్ చేస్తున్న భారీ చిత్రం అని చెప్పొచ్చు.

**అనిరుధ్ మ్యూజిక్ స్పెషల్ హైలైట్**

ఈ సినిమా మ్యూజిక్‌ను తమిళ సూపర్ టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. ఇప్పటికే అనిరుధ్ తన మ్యూజిక్‌తో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్నాడు. ఈ సినిమా బ్యాగ్రౌండ్ స్కోర్, సాంగ్స్ ఖచ్చితంగా హైలైట్‌గా నిలవనున్నాయి.

**సినిమాపై భారీ అంచనాలు!**

‘దసరా’ సినిమా తర్వాత నాని నుంచి వస్తున్న మరో మాస్ మూవీ కావడంతో ప్రేక్షకుల్లో అంచనాలు తారాస్థాయికి చేరాయి. నాని తన మాస్ అవతార్‌లో కనిపించిన రా స్టేట్‌మెంట్ వీడియో అందరికీ గూస్‌బంప్స్ తెప్పించింది. ఇక మేకర్స్ ప్లాన్ ప్రకారం, వచ్చే ఏడాది మార్చి 26న ఈ సినిమాను గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.

## మమ్ముట్టి ఆరోగ్యం కోసం శబరిమలలో మోహన్‌లాల్ పూజలు

ఇద్దరు దక్షిణాది సూపర్‌స్టార్లే . చాలామంది వాళ్లిద్దరు ఇండస్ట్రీలో ప్రత్యర్థులని పొరపడుతారు.. కాని ఇద్దరు ఆప్తమిత్రులు%ొ% మమ్మూటి , మోహన్‌లాల్ ఫ్రెండ్‌షిప్ విషయంలో కొత్త వివాదం తెరపైకి వచ్చింది. అనారోగ్యంతో బాధపడుతున్న మమ్ముట్టి తొందరగా కోలుకోవాలని శబరిమల అయ్యప్ప ఆలయంలో మోహన్‌లాల్ పూజలు చేయడంపై వివాదం రాజుకుంది. శబరిమలలో మోహన్‌లాల్ పూజలు చేసిన వీడియో సామాజిక మాద్యమాల్లో వైరల్‌గా మారడంతో ఆయనపై ముస్లిం సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మమ్మూటి ముస్లిం..

మమ్ముట్టి ఆరోగ్యం కోసం శబరిమలలో మోహన్‌లాల్ పూజలు

**ఇద్దరు ఆప్తమిత్రులు**

ఇద్దరు దక్షిణాది సూపర్‌స్టార్లే . చాలామంది వాళ్లిద్దరు ఇండస్ట్రీలో ప్రత్యర్థులని పొరపడుతారు.. కాని ఇద్దరు ఆప్తమిత్రులు%ొ% మమ్మూటి , మోహన్‌లాల్ ఫ్రెండ్‌షిప్ విషయంలో కొత్త వివాదం తెరపైకి వచ్చింది. అనారోగ్యంతో బాధపడుతున్న మమ్ముట్టి తొందరగా కోలుకోవాలని శబరిమల అయ్యప్ప ఆలయంలో మోహన్‌లాల్ పూజలు చేయడంపై వివాదం రాజుకుంది.

M§ ˘jîÖ kJeÖ›¿ £ eÖ<S«eÖýE¢ yîÖsAýÙ

శబరిమలలో మోహన్‌లాల్ పూజలు చేసిన వీడియో సామాజిక మాద్యమాల్లో వైరల్‌గా మారడంతో ఆయనపై ముస్లిం సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మమ్మూటి ముస్లిం.. ఆయన అసలు పేరు మహ్మద్ కుట్టి.. అలాంటప్పుడు ఆయన వేగంగా కోలుకోవాలని అల్లానే ప్రార్థించాలి .. కాని అయ్యప్పస్వామిని ఎలా మోహన్‌లాల్ వేడుకుంటారని కొన్ని ముస్లిం సంస్థలు ప్రశ్నిస్తున్నాయి. శబరిమలలో మోహన్‌లాల్ ఆయన కోసం ప్రత్యేక పూజలు చేయడాన్ని తప్పుపడుతున్నాయి.







TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339